25-6-54

నాలుగు వేదీలు ఐ.జి0-1-0

గోలకొండ పత్రిక

తెలంగాణమునుండి వెలువడు ఏకైక జాతీయ దినపత్రిక

ఫోన్: నెం. 4280

హైద్రాబాద్ 25-6-54 శుక్రవారం

గోలకొండ పత్రిక
సంవత్సర చందా ఐ.జి. రు. 25-0-0
ఆరుమాసముల చందా „ „ 13-0-0
మూడు మాసముల „ „ „ 6-12-0

మూడు మాసములకు తక్కువ చందా తీసికొనబడదు.

మేనేజరు
గోలకొండ పత్రిక

సాపితము 1925
రిజిష్టర్డు నెం. 45

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడి ఎం.ఏ.

సంపుటము 7
సంచిక 146

100336

ముఖర్జీ మృతిపట్ల నిష్పాక్షిక విచారణ

కోరుతూ జనసంఘ ప్రజా పరిషత్ కార్యకర్తల నిరశనవ్రతం!

జమ్ము, జూన్ 24

డా॥ శ్యామప్రసాద్ ముఖర్జీ మృతిపట్ల నిష్పాక్షిక విచారణ జరిపించనిచో జనసంఘ, ప్రజాపరిషత్తు కార్యకర్తలు ఆమరణ నిరశనవ్రతం పూనగలరని గతరాత్రి ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ ఆయానంస్థల నాయకులు ప్రకటించారు.

డా॥ ముఖర్జీ వర్ధంతి సందర్భంలో నిన్న యీ బహిరంగ సభ జరిగింది.

పి. సి. సి. అధ్యక్షతకు ముగ్గురి నామినేషన్లు

మల్లప్ప కౌలూరు, దేవీసింగ్ చౌహాన్, వెంకటరావు జాధవ గారలు

హైద్రాబాద్, జూన్ 24

హైద్రాబాద్ ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుని ఎన్నికకు మూడు నామినేషన్లు చేరినవి. నామినేషన్లు దాఖలు చేయడానికి నేడు ఆఖరుతేదీ వారిపేర్లు శ్రీ మల్లప్ప కౌలూరు (కర్ణాటక), శ్రీ దేవీసింగ్ చౌహాన్ (మహారాష్ట్ర), శ్రీ వెంకటరావు జాధవ (మహారాష్ట్ర) మొత్తం 180 మంది పి. సి. సి. ప్రతినిధులలో 107 గురు గల తెలంగాణ ప్రతినిధులెవ్వరూ పోటీకి తలచబడలేదు.

ఈ నామినేషన్ల పరిశీలన రేపుజరుగుతుంది. ఎన్నిక జూలై 10 వ తేదీన జరుగుతుంది.

పోటీలేకుండా ఏకగ్రీవ ఎన్నిక జరగడానికి ఈలోగా అగ్రనాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. బహుశా శ్రీ వెంకటరావు జాధవ విరమించుకొనవచ్చునని శ్రీ మల్లప్ప కౌలూరు, దేవీసింగ్ చౌహాన్‌గారల ముఖ్య పోటీ జరగడమో లేక శ్రీ చౌహాన్ కూడ పోటీనుండి విరమించడమో జరగవచ్చునని భావించబడుచున్నది. అందు శ్రీ మల్లప్ప కౌలూరు ప్రస్తుత ప్రదేశ్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీదేవీసింగ్ చౌహాన్ మాజీ మంత్రి, ఐక వేళ వీరిద్దరి మధ్య పోటీ జరిగినా శ్రీ మల్లప్ప కౌలూరు గెలుపొందటం తథ్యమని చెప్పబడుతున్నది. పత్రికను విరమిస్తున్న ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు, రెవిన్యూమంత్రి ఆయిన శ్రీ కొండా వెంకట రంగారెడ్డిగారు శ్రీ మల్లప్ప కౌలూరును బలపరుస్తున్నారు. రంగారెడ్డిగారి వర్గానికి పి. సి. సి. లో మెజారిటీ ఉంది.

పోరంబోకు భూములలో సేద్యం

ఫార్మర్స్ యూనియన్ ప్రయత్నంవలన తావాకమాఫీ

హయిద్రాబాద్, జూన్ 24

పోరంబోకు, గాయరాన్, బంచరాయి భూములను దున్ని సాగుచేసిన రైతులపై హయిద్రాబాద్ స్టేటు మొత్తంపై తావాన్ విధించబడియుండెను. దీని మూలంగా పేదరైతులు యిబ్బంది పడుచుండిరి. మహబూబ్ నగరంజిల్లా లోకసభ సభ్యుడు శ్రీ కే. జనార్దనరెడ్డి తదితర ఫార్మర్స్ యూనియన్ కార్యకర్తలు యీ విషయంలో భూమ్యాదాయ శాఖ మంత్రి ఉపమంత్రులకు సరియైన విషయాలను తెలిసిన ఫలితంగా తావాన్ మాఫీచేయిందుటకు వారుఅంగీకరించినట్లు తెలియవస్తున్నది. తక్కిన గాయరాన్ పోను మిగతాభూమిలో సేద్యంచేసినజారిపై తావాన్ విధించబడబోదని తెలుస్తున్నది. (స్వ. వి.)

ఎకరానికి 112 పౌనుల బియ్యం అధికోత్పత్తి

న్యూఢిల్లీ, జూన్ 23

ఇండియాలో 1952-53 కంటే 1953-54 సంవత్సరంలో బియ్యంఉత్పత్తి ఎకరానికి 112 పౌనులు పెరిగినట్లు తెలుస్తున్నది.

ఇప్పుడు లభించే లెక్కల ప్రకారం కూర్గుఉత్పత్తి ఎక్కువగాఉంది. అక్కడ ఎకరానికి సగటున 1215 పౌనులు పండుతున్నది.

మైసూరు, పశ్చిమ బెంగాల్‌లో కూడ ఉత్పత్తి యెక్కువగా ఉంది. కాని ఉత్తరప్రదేశ్, ఒరిస్సాలలో చాలతక్కువగా ఉంది.

ఈ అధికోత్పత్తి నూతన సేద్యపద్ధతి ఎరువుల వాడకం ఫలితమని కేంద్రవ్యవసాయ మంత్రాంగం నమ్ముతున్నది. (నేషన్)

ఐరోపా జర్నలిస్టుల రాక

నెహ్రూ-చౌ ఎన్‌లై చర్చల సందర్భంలో

బొంబాయి, జూన్ 24

రేపు న్యూఢిల్లీలో ప్రారంభం కానున్న భారత-చైనా ప్రధానుల చర్చల్ని రిపోర్టు చేయడానికి గాను ఇరువురు ఐరోపాజర్నలిస్టులు నేడు బొంబాయి వచ్చారు. పారిస్ పత్రిక "దుపార్క్"లోని దూరప్రాచ్య వ్యవహారాల సంపాదకుడు వై. ఫిగారో మరియు జెనీవానుండి వచ్చే ఒక స్విట్జర్లాండు పత్రికా ప్రతినిధి బెర్నార్డ్ బెరూయిన్ అనే ఈ జర్నలిస్టులుగాక మరో నలుగురు జర్నలిస్టులు నేడు ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్ విమానంలో దిగారు. వీరిద్దరూ ఢిల్లీకి బయలుదేరివెళ్ళారు.

మారేడ్‌పల్లిప్రాంతంలో క్రొత్త పోస్టాఫీసు

సికిందరాబాద్, జూన్ 24

మారేడ్‌పల్లి ప్రాంతంలోని ప్రజల సౌకర్యార్థమై పోస్టల్ శాఖవారు మారేడ్‌పల్లిలో ఒక క్రొత్త పోస్టాఫీసును తెరచారు.

గ్వాటిమాలా ద్వితీయ అభ్యర్థన

దురాక్రమణ చర్యల చర్చింపవలసినదిగా మండలికి

న్యూయార్కు, జూన్ 24

తమ దేశంపై జరుగుచున్న దురాక్రమణ చర్యల పరిశీలింప వలసినదిగా గ్వాటిమాలా ప్రభుత్వ రెండవమారు భద్రతా మండలిని కోరినది. సంయుక్త రాజ్యసమితికి వ్రాసిన లేఖలో వాషింగ్టన్‌లోని గ్వాటిమాలా ప్రభుత్వ కార్యదర్శి గత మధ్యరాత్రి కోరాడు ప్రస్తుతం భద్రతా మండలిఅధ్యక్షుడగు లాడ్జు మండలిసమావేశం రెండవమారు జరుపడంవల్ల లాభంలేదని ఆ సమావేశం ప్రచారానికే తోడ్పడగలదని అభిప్రాయ పడినాడు. (యు. పి. ఐ)

సిర్పూరు కార్మికుల పోరాటం

బలపరచాలని

మక్దూం మొహియుద్దీన్ విజ్ఞప్తి

హయిద్రాబాదు, జూన్ 24

అఖిలహైద్రాబాద్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుడు మక్దూం మొహియుద్దీన్, ఎం. ఎల్. ఏ. సిర్పూరు తాజ్‌గ్లాసు పరిశ్రమలోని కార్మికుల పోరాటాన్ని ఎ. హెచ్. టి. యు.సి. పూర్తిగా బలపరుస్తుందన్నారు.

సిర్పూరు పేపర్ మిల్సు, సిర్ సిల్కు ఫ్యాక్టరీలో దమననీతిని మక్దూం విమర్శించారు. డిస్టిలరీ కార్మికులకు వార్షిక బోనసు చెల్లించడం ప్రభుత్వం నిలిపివేసింది.

గత జనవరిలో అఖిలట్రేడ్‌యూనియన్ కోఆర్డినేషన్ కమిటీని తిరిగి పునః స్థాపించి కార్మికులను దగ్గరికి చేర్చాలని ఉద్బోధించారు.

నేడే రాజధానికి చైనా ప్రధాని ఆగమనం

జెనీవా చర్చలు సఫలం కావాలని ఆశాభావం

మూడురోజుల కార్యక్రమం

న్యూఢిల్లీ, జూన్ 24

చైనా ప్రధాని విదేశాంగమంత్రి అయిన మిస్టర్ చౌ ఎన్ లైను తీసుకొనివచ్చే ఐ. ఏ. ఎఫ్. ప్రత్యేకవిమానం శుక్రవారంఉదయం 7-15 గంటలకు పాలం విమానాశ్రయంలోని ఐ. ఏ. ఎఫ్. స్టేషన్‌వద్ద దిగుతుంది.

భారతప్రధానినెహ్రూ ఆయనను విమానాశ్రయంవద్ద ఎదుర్కొని స్వాగతమిస్తారు. చైనాప్రధానికి మంత్రులు రాయబారులను పరిచయంచేసేముందు ఆయన వందనస్వీకారం చేస్తారు.

విమానాశ్రయంవద్ద చైనా జాతీయ గీతం పాడబడుతుంది. ఆయన రాష్ట్రపతిభవనానికివచ్చిన వెంటనే రాజఘాట్‌కువెళ్ళి జాతిపితమహాత్మాగాంధీ సమాధిపైపూలమాలఉంచుతారు. రాజఘాట్‌నుండి తిరిగివచ్చినతరువాత చౌ ఎన్ లై ప్రధానినెహ్రూ వైస్ ప్రెసిడెంట్ డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రెసిడెంట్ డా॥ రాజేంద్రప్రసాదులను ఒక్కొక్కరిని అరగంట సేపుకలుసుకొని మాట్లాడుతారు.

మధ్యాహ్నం ఇరువురు ప్రధానమంత్రులు తిరిగి కలుసుకొని చర్చలుప్రారంభిస్తారు.

శుక్రవారము సాయంత్రము చైనా ప్రధాని గౌరవార్థం ప్రెసిడెంటునన్నానం ఏర్పాటుచేస్తారు. రాత్రి ప్రధానమంత్రితో ప్రత్యేకంగా చౌ ఎన్ లై విందుగడుస్తారు.

శనివారంరాత్రి ప్రధానినెహ్రూ చౌ ఎన్ లై గౌరవార్థం సన్మానము ఏర్పాటుచేస్తారు. ఇంతకుముందు తమ ప్రధానమంత్రినికలుసుకోడానికి చైనా రాయబార కార్యాలయం వారు కార్యాలయంలో సన్మానం ఏర్పాటు చేస్తారు. ఇంతకుముందు చౌ ఎన్ లై వైస్ ప్రెసిడెంటు డా॥ రాధాకృష్ణన్‌తో తేనీరుగడుస్తారు.

చైనాప్రధానితెంట ఇరువురునలహోదారులు, ముగ్గురు కార్యదర్శులు పదిమంది ఇతర సహకారులునస్తారు. సలహాదారులపేరులుచాంగ్ వెన్‌చిన్, స్కోచెంగ్, మాలేహ.

చైనా ప్రధాని చౌ ఎన్ లైని ఆహ్వానించే సందర్భంలో జరిగే కార్యక్రమాన్ని ప్రత్యక్ష వ్యాఖ్యాన సహితంగా శుక్రవారంనాడు ఆలిండియా రేడియో ఢిల్లీ కేంద్రంవారు రాత్రి 8-30లకు ప్రసారంచేస్తారు.

చౌ ఎన్ లై ఆగ్రాకాళ్ళి ఆదివారం నాడు తాజ్ మహల్‌ను కూడా సందర్శిస్తారు. ఆయనరేపు పత్రికా విలేఖలతో కూడా మాట్లాడుతారు.

చౌ ఎన్ లై ఆయనతో పాటు వచ్చినవారు సోమవారంనాడు పెకింగుకు బయలుదేరతారు. దారిలో వారు సింగపూర్, రంగూన్, కాంటన్‌లలో ఆగుతారు.

జెనీవా సమావేశం సఫలం కావాలి

నేడు చైనా ప్రధాని చౌ ఎన్ లై జెనీవానుండి ప్రయాణమౌతూ విమానాశ్రయంలో తనను కలుసుకున్న పత్రికా విలేఖరులతో మాట్లాడాడు. జెనీవా సమావేశం అభివృద్ధికరంగా సాగుతుందనీ ఇండోచైనాలో శాంతి స్థాపనకద కృషి చేయగలదని శాంతి కాముక రాజ్యాలు బాంచిస్తున్నాయనీ ఆశపడన్నాడు. తాత్కాలికంగా తాను జెనీవా విడిచిపోతున్నానంటూఆయన స్విస్ ప్రజలకు తన ప్రతినిధివర్గానికి హార్దికాభినందన అతిథి మర్యాదలపట్ల కృతజ్ఞత తెలిపాడు. పాంబాండాంగ్ విమానాశ్రయంలో వీట్నామ్ ప్రతినిధి వర్గము, సోవియట్ డిప్యూటీ విదేశాంగమంత్రి వాసిలీ కుజ్నెట్సోవ్‌లు వీడ్కోలిస్తుండగా స్విస్ సైనికులవందనాన్ని స్వీకరిస్తూ చౌ ఎన్ లై భారత ప్రభుత్వం పంపిన విమానంలో ఎక్కాడు.

చౌ ఎన్ లై బయలుదేరిన కొలదిసేపటికే చైనా ప్రతినిధివర్గంలోని 12 మంది సభ్యులు ఒక స్విస్ విమానంలో జూరిచ్, ప్రేగ్‌నగరాలకు బయలుదేరి వెళ్ళారు.

చైనాప్రధాని చౌ ఎన్ లై ప్రభుత్వ అతిథిగాకాక అంతకు మించి అధ్యక్షుని అతిథిగానే ఉండగలడు. అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌కు ఆరోగ్యం సరిగా లేనప్పటికీ చౌన్‌లై ఏర్పాట్లు చేయడంలో శ్రద్ధవహిస్తున్నారు. మహరన్‌పూర్ (యు.పి) జిల్లా మేజిస్ట్రేట్‌కు చౌకు అవసరమైన చైనా పండ్లు, ఫలాలు మున్నగునవి సప్లయిచేయడానికి ఆర్డరుఇవ్వబడింది. మంచి మామిడిపళ్లు, ఆపిలుపళ్ళు కూడా సేకరించబడుతున్నాయి. భారతీయ సినిమాలు డాక్యుమెంటరీలుకూడా తాముచూడదలుస్తున్నామని చౌ ఎన్ లై వర్గం టెలిగ్రాం పంపినందున దాదాపు 10 ఫిల్ములు వారికి చూపేనిమిత్తం సెలెక్టు చేయబడ్డాయి.

స్టేట్‌లో మరో మెడికల్ కాలేజి

కొందరి సంపూర్ణ ప్రయత్నం

హయిద్రాబాద్, జూన్ 24

హయిద్రాబాద్‌లోని కొందరు డాక్టర్లు కొందరు ప్రజాహితైషులు కలిసి హయిద్రాబాద్ రాష్ట్రంలో మరో మెడికల్ కళాశాల ఏర్పాటు నకు పనిచేస్తున్నారని విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తున్నది.

మొట్టమొదట వీరంతా కలిసి 15 లక్షల రూపాయలు సేకరించ దలపెట్టారు.

ఈ యేడాదిలోనే యీ క్రొత్త మెడికల్ కళాశాల ఏర్పాటయ్యేట్లు వీలుగా తమ విరాళాలిచ్చి తోడ్పడవలసిందిగా త్వరలో విజ్ఞప్తి చేయబడగలదని తెలుస్తున్నది.

ప్రస్తుతం వందమంది ఎం.బి.బి.ఎస్ విద్యార్థులలో ఒక మెడికల్ కాలేజి ఉన్నప్పటికీ అది ఏమాత్రం సరిపోవడంలేదు.

గోధుమల రేటు తగ్గింపు

న్యూఢిల్లీ, జూన్ 24

దిగుమతి కాబడిన గోధుమల ధరను మణుకు 15-8-0 నుండి 14-8-0 తగ్గించడానికి భారత ప్రభుత్వం నిశ్చయించింది. సెంట్రల్ సేల్స్ డిపోనుండి విడుదలయ్యే గోధుమలకు యీ రేటు జూన్ 25 వ తేదీనుండి అమల్లోకి వస్తుంది.

రష్యాలో తంతి తపాలా శాఖ అభివృద్ధి

సలహాసంఘ సమావేశంలో డైరెక్టరు వివరణ

హైద్రాబాద్, జూన్ 14

హైద్రాబాద్ తంతి తపాలా శాఖ సలహాసంఘ సమావేశం నిన్న తంతి తపాలాశాఖ డైరెక్టర్ శ్రీ మహేశ్వర దయాల్ అధ్యక్షతన జరిగింది. శ్రీ హరిశ్చంద్రహెడా (ఎం-పి), హైద్రాబాద్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ప్రతినిధి ఎస్. జి. బ్రహ్మకా, కామర్స్ ఇండస్ట్రీస్ చేంబర్ ప్రతినిధి ఆర్-ఎం త్రివేదీ, తంతిశాఖ డివిజనల్ ఇంజనీర్ కె-వి-డి పటేల్ డిప్యూటీ డైరెక్టర్ కె. రామ్మూర్తి, తపాలాశాఖ డిప్యూటీ డైరెక్టర్ సి-పి దయానందన్‌లు హాజరయ్యారు.

శ్రీ హెడా మాట్లాడుతూ హైద్రాబాద్ రాష్ట్రానికి ప్రత్యేక పోస్టల్ సర్కిల్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్రం నిర్ణయించినందుకు అభినందించి దీని అభివృద్ధికి కృషిజరుగగలదని ఆశించారు.

తంతి తపాలాశాఖ వ్యాప్తిని గురించి వివరాలందజేస్తూ డైరెక్టర్ రాష్ట్రంలో 240 గ్రామ పోస్టాఫీసులు, 2 పట్టణ పోస్టాఫీసులు, 9 టెలిగ్రాఫ్ ఆఫీసులు, 1 రేడియో ఫోనస్టేషన్, 1 టెలిఫోన్ ఎక్స్‌చేంజి తెరవబడ్డాయనీ, 205 క్రొత్త టెలిఫోన్ కనెక్షన్లు ఇవ్వబడ్డాయనీ తెలిపారు. 1954-55లో 450 గ్రామ పోస్టాఫీసులు, 30 టెలిగ్రాఫ్ ఆఫీసులు, 8 టెలిఫోన్ ఎక్స్‌చేంజిలు, 13 పబ్లిక్ కాల్ ఆఫీసులు తెరవబడగలవని ఆయన తెలియబరిచారుకూడా. ఉత్తరాలమీద చిరునామాలు వ్రాసేటప్పుడు జోనల్ పోస్టాఫీసు నంబర్లు కూడా వేయవలసిందిగా ఎంత ప్రచారంచేసినా ఎంత పోస్టర్లు వేయించినా ఎన్ని మ్యాపులు ప్రచారంలోకితెచ్చినా ప్రజలనుంచి సరైన సహకారం లభించలేదనీ అనేక ఉత్తరాలపైన జోనల్ పోస్టాఫీసు నంబర్లు ఉండడంలేదనీ డైరెక్టరు అన్నారు.

మెసేజ్ రేట్ విధానం వచ్చిన తర్వాత యే యే నంబర్లుపిలిస్తే కాల్ రేట్ వర్తించదో వివరిస్తూ డైరెక్టరు ఇలా తెలిపారు:

టెలిఫోన్ నంబర్లు 8 (ఎంక్వయరీ), 9 (కంప్లెయింట్లు), 0 (ట్రంక్‌లు), 7000 (ట్రంక్ ఎంక్వయరీలను పిలిస్తే కాల్‌రేటు వర్తించదు. అగ్నిప్రమాద సందర్భంలోను అంబులెన్స్ అవసరతలోను అర్జెంటుగా టెలిఫోన్ వాడవలసివస్తే నంబరు 6 పిలవాలి. ఆపిలుపు నిజమైన అవసరాన్నిబట్టి అయినట్లయితే చార్జిచేయబడదు. తప్పుడు కనెక్షన్లు యివ్వబడినప్పుడు వెంటనే నంబరు 9 కి కలిపినచితే వారిపై విచారణజరిపి నిజమైతే ఆపిలుపులకు చార్జిని మినహాయిస్తారు. ఆ మినహాయింపునకు గాను క్రెడిట్ కాల్ టికెట్లు ఇవ్వబడుతాయి.

పాక్ అధికారి ఆక్షేపణీయ కార్య కలాపాలు

ఇండియా సూచనపై పాకిస్థాన్‌చే అధికారి ఉపసంహరణ

న్యూఢిల్లీ, జూన్ 24

భారత ప్రభుత్వ సలహాపై ఇండియాలోని పాకిస్థాన్ హై కమీషనకు సంబంధించిన మిలటరీ సలహాదారు కర్నల్ నాసిర్ అహ్మద్ ఖాన్‌ను పాకిస్థాన్ ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు తెలుస్తున్నది.

కర్నల్ ఖాన్ ఇండియాలో ఆక్షేపణీయమైన కార్య కలాపాలతో సంబంధం ఉండు కుంటునట్టు అనుమానింప బడుతున్నందున ఆ తడు ఇండియాలో ఉండడంమంచిది కాదని భారత ప్రభుత్వం సూచించిన మీదట పాక్ ప్రభుత్వం అతనిని వాపసు పిలుచుకుంది.

శరణార్థుల పునరావాస సమస్యను రాజకీయంగా వినియోగించవలదు

ఇండో-చైనా సమస్యాపరిష్కారం

మెండేస్ ఫ్రాన్సు విశ్వాసం

ప్యారిస్, జూన్ 24

చైనాప్రధాని చౌ ఎన్‌లైమున్నుందు ఇండో-చైనాలో యుద్ధ విరమణకు గాను ఒక పద్ధతి ఆలోచించి తర్వాత రాజకీయ సమస్యాపరిష్కారానికి అంగీకరించాడని ఆయనతో మాట్లాడిన సూతన ఫ్రెంచి ప్రధాని మెండేస్ ఫ్రాన్స్ నేషనల్ అసెంబ్లీలో మాట్లాడుతూ తెలిపాడు. తప్పక సమస్యా పరిష్కారం జరుగుతుందనీ నెలరోజుల్లో అది సాధ్యపడకపోతే తాను రాజీనామా ఇస్తానని మెండేస్ ఫ్రాన్స్ అన్నాడు.

ఈ విషయంతప్ప ఆ తడు చౌ ఎన్ లైతో ఇంకేమీ మాట్లాడలేదట.

యువతి అపహరణ

ఇద్దరు రాజస్థాన్ వ్యక్తులచే

హైద్రాబాద్, జూన్ 24

విద్యావతి అను 25 సంవత్సరాల యువతిని జూన్ 1వ తేదీన ఇద్దరు వ్యక్తులు ఉదయపూర్ నగరానికి అపహరించి తీసుకుపోయిన ఉదంతంపై హైద్రాబాద్‌నగర పోలీసులు విచారణ సాగిస్తున్నారు. పోలీసులు తమ నివేదికను నేడు హైద్రాబాద్ జిల్లా మేజిస్ట్రేట్‌కు అందజేశారు:

కేసు వివరాలివి:

విద్యావతి అనునామె చార్మినార్ వద్దగల ఒక ఆయుర్వేద వైద్యశాలలోని డాక్టర్ రామచంద్రగారి భార్య. డాక్టర్ ఆసుపత్రిలో ఉండగా చుడీబజారులోని ఆయన ఇంటినుండివిద్యావతిని సురాజ్‌మల్, బాబుఅనువారలు రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు బలవంతాన ఆమె ఇష్టంలేకుండా తీసుకుపోయారు. ఈ విషయమై డా॥ రామచంద్ర హోంమంత్రికి కంప్లెయింట్ చేశారు.

దొంగల ముఠాల అరెస్టు

కొత్తగూడెం కాలరీ ప్రాంతాల్లో

కొత్తగూడెం, జూన్ 24

కొత్తగూడెం, ఎల్లాందు, తాండూరు గ్రామాల్లో అనేక దొంగతనాలకు మూలమైన గజదొంగ ఎడ్వర్డు అతని సహచరి సుశీలారాణి (28) అను వారలను పోలీసు ఇన్స్‌పెక్టర్ ఫ్రాంక్లిన్ జూన్ 18న కూలీలైన్లలోని ఒక సాధువు గుడిసెనుండి అరెస్టుచేశాడు. వీరి ముఠాకుచెందిన మరి ముగ్గురు దొంగలుకూడా అరెస్టు చేయబడ్డారు.

వీరినుండి 14 దొంగతనాలకుసంబంధించినసొమ్ము వశపరచుకో బడింది.

చుంచుపల్లి, బెల్లంపల్లి, హేమచంద్రాపురం ప్రాంతాల పనిచేస్తున్న మరి 8 మంది గజదొంగల ముఠా కూడా అరెస్టు చేయబడి దొంగసొమ్ము వశపర్చుకొన బడింది.

ప్రధాని సలహాదారుడనే హోదా పెట్టుకొని మోసగిస్తున్న వ్యక్తి

న్యూఢిల్లీ, జూన్ 24

వి. తామస్ సింగరాయన్ (22), కొల్లుపేట వీధి, మనాంబు చావడి, తంజావూరు) అనునాతడు తన లెటర్ హెడ్స్‌మీద భారతప్రభుత్వ ప్రధాని మాత్యునికి సలహాదారు అనుహోదాను ముద్రించుకొని వాడు కుంటున్నట్లు ప్రధాని కార్యదర్శి దృష్టికి వచ్చింది. అటువంటి హోదాయేమీ ఆ వ్యక్తికి లేదనీ ఆయన స్పష్టపరుస్తూ నేడొక ప్రకటన చేశారు.

పశ్చిమ తూర్పు పాకిస్థాన్ కాందిశీకుల మధ్య తేడాలుచూపబడడం లేదని ప్రధాని నెహ్రూ

న్యూఢిల్లీ, జూన్ 24

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ సహకారంతోపాటు తూర్పు బెంగాల్ శరణార్థుల పునరావాన సమస్యపట్ల సర్వశ్రద్ధతీసుకో బడగలదని హామీయిస్తూ నేడు ప్రధానినెహ్రూ ఒక పత్రికా ప్రకటన చేశారు. తూర్పు బెంగాల్ శరణార్థుల సమస్యను ఒక రాజకీయ సమస్యగా చేయవలదనీ యీ సమస్యా పరిష్కారంలో తోడ్పడవలసిందనీ ఆయన శరణార్థులకే కాక తదితరు లందరికికూడా విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రధాని నెహ్రూ కావించిన ప్రకటనలో ఇలా ఉంది:

"ఒక నెల రోజులక్రితం కొందరు లోక సభానాభ్యులు తూర్పు బెంగాల్ శరణార్థుల పునరావాన సమస్యను గురించి నావద్దకు రాయబారం వచ్చారు. పశ్చిమ పాకిస్థాన్ తూర్పు పాకిస్థాన్ శరణార్థులమధ్య భేదం చూపబడుతున్నదని భావించవద్దని [illegible] మొదట ఉద్ఘాటంగా పశ్చిమ. పాకిస్థాన్‌నుండి శరణార్థులు రాప్రారంభించారు. అందువల్ల సహజంగా దృష్టి వారిపైపు మరల్చవలసి వచ్చింది. తర్వాత కొన్నాళ్ళకు తూర్పు పాకిస్థాన్‌నుండి కూడా శరణార్థులు రావడము తిరిగి వెళ్ళడమూ జరుగుతూవచ్చాయి. ఈ పరిస్థితి కొంత సెనులుబాటుగా ఉన్నందున శరణార్థుల ఆస్తి పాస్తులచట్టాలు గాని మరేవైనాగాని పశ్చిమ పాకిస్థాన్ శరణార్థులను దృష్టిలో ఉంచుకొని చేయబడ్డాయి. కానిరిఇప్పుడు మాత్రం పశ్చిమ పాకిస్థాన్ శరణార్థులకన్న తూర్పు పాకిస్థాన్ శరణార్థులపట్ల ఎక్కువ శ్రద్ధ వహించాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ సందర్భంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంతో కలిసి తూర్పు పాకిస్థాన్ శరణార్థుల పునరావాన సమస్య కెక్కువ ప్రాధాన్యం ఇస్తామని ఆరాయబార వర్గానికి తెలిపాను. అంతటితో అది సంతృప్తికరంగా ముగిసిందని భావించాను.

కాని ఆలోకసభ సభ్యులు భారత ప్రభుత్వ పునరావానశాఖ పక్షపాతం చూపుతున్నట్లుగా ప్రచారం ప్రారంభించినట్లు విన్నాను. కొందరు పునరావాన శాఖా మంత్రి రాజీనామా ఇవ్వాలనికూడా కోరారు. ఇది రాజకీయ సమస్యగా తేవాలని ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తున్నది. ఇలా చేసినందువల్ల మనం సహాయపడ దలుస్తున్న కాందిశీకులకు లాభం కలుగదు. కాపున యీపరిస్థితివల్ల నేను విచారాన్ని వెల్లడిస్తున్నాను.

సహన సామర్థ్యాలతో శరణార్థుల సమస్యను ఎదుర్కొని చాలా వరకు కృతకృత్యుడైన భారత ప్రభుత్వ పునరావాసశాఖామంత్రిని నేను అభినందిస్తున్నాను. అలాగే పునరావాన వ్యవహారాలుచూస్తున్న పశ్చిమ బెంగాల్ మంత్రికూడా కష్టపడి పనిచేస్తున్నారు. బాహ్యతారాహిత్యంగా వీరిపైఆరోపణలు మోపడం విని నేను విభ్రాంతుడనయ్యాను. ఇంతకన్న వివరాలకు నేను పోదలుచుకోలేదు. కావలసివస్తే పునరావానశాఖ వ్యవహారాలన్నీ ప్రజల ముందుంచబడగలవు. ఇందులోరహస్యమేమీలేదు.

తూర్పు బెంగాల్ శరణార్థులకు పశ్చిమ బెంగాల్‌లో కాక ఇతరత్రా పునరావానం కల్పించడానికి అన్ని ప్రయత్నాలు జరిగాయి. వారికి భూములు ఇవ్వబడ్డాయి. అనేక మంది అలా పునరావాసానికి అంగీకరించారు. అయినా వారిని వెళ్ళవద్దని కొందరు ప్రోత్సహించడం జరిగింది. ఇలాచేయడం భాగలేదు. పశ్చిమ బెంగాల్‌లో వీరందరికి ఇవ్వదగినంత భూమిలేదు. పశ్చిమ బెంగాల్ చాటిపోవద్దని వారిని అటకాయించినందువల్ల వారి కష్టాలను ఎక్కువ చేయడమే అవుతుంది.

అందువల్ల ఒక్క శరణార్థులనేకాక తదితరులందరినూ కూడా సహకరించి ప్రభుత్వ పునరావాన ప్రణాళికలు విజయవంతమయ్యేట్లు చూడాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను."

పి-ఎస్-పి తెలంగాణ ప్రతినిధుల సమావేశం

నెలరోజుల్లో ఏర్పాటు కావాలని కార్యవర్గ తీర్మానం

హైద్రాబాద్, జూన్ 24

రాష్ట్రాల పునర్విభజనా సమస్యను గురించి కర్నూల్లో తీసుకున్న నిర్ణయాన్ని నిర్ధారించేందుకుగాను 30 రోజుల్లోగా వనరర్తి సమావేశానికి ఎన్నుకోబడిన పి-ఎస్-పి తెలంగాణ ప్రతినిధుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర పి-ఎస్-పి కార్యవర్గం శ్రీ సి. మాధవరెడ్డి అధ్యక్షతన సమావేశమై తీర్మానించింది.

ఈ సమావేశం జరిగేవరకూ విశాలాంధ్రవాదులు, ప్రత్యేక తెలంగాణవాదులూ బహిరంగంగా ప్రతిపాదించుకోడం మనికాదని విశాలాంధ్రీలను కోరుతూ కర్నూలులో తీసుకోబడిన తీర్మానం పి-ఎస్-పి అధికార తీర్మానంగా రాష్ట్రాల పునర్విభజన కమీషన్‌కు సమర్పింపబడుతుందని యీ అధికార దృక్పథంతో ఏకీభవించనివారు వేరే మెమోరాండం సమర్పించవచ్చుననికూడా నేడు కావించబడిన తీర్మానంలో పేర్కొనబడింది.

ఫ్రాన్స్ మంత్రివర్గ తొలిసమావేశం

పారిస్, జూన్ 24

ఫ్రెంచి ప్రధాని మెండేస్ ఫ్రాన్స్ నిన్న తన మంత్రివర్గపు తొలిసమావేశాన్ని జరిపి ఇండోచైనా సమస్యను చర్చించారు.

మంత్రివర్గ సమావేశానంతరం మెండేస్ ఫ్రాన్స్, పత్రిక ప్రతినిధులకు ఇండోచైనాకు ఫ్రెంచి సర్వసైన్యాధ్యక్షుడు వెళ్ళేముందుగానేషనల్ డిఫెన్స్ కమిటీతో సంప్రదించగలరనిఅన్నారు. జూలై 20 వ తేదీన ఆర్థిక అభివృద్ధికి తాను ఫ్రాన్సు అసెంబ్లీ ముందు ఒక ప్రణాళికను ఉంచగలనని ఇతను అన్నాడు. (యు. పి. ఐ)

వైద్య విద్యార్థులకు మృతదేహాలు

రాష్ట్ర అసెంబ్లీ ఆగస్టు సమావేశంలో బిల్లు

హైద్రాబాద్ జూన్ 24

ఎవరికీ చెందని మృతదేహాలను వైద్య విద్యార్థుల పరిశోధనలకుగాను యి వ్వడానికి గాను ఒకబిల్లు రాష్ట్రశాసనసభ ఆగస్టు సమావేశంలో ప్రతిపాదించబడుతుందని తెలుస్తున్నది.

ప్రస్తుతం అలాంటి మృతదేహాలు దహనక్రియలకై ఆయా కులాల పెద్దలకుయివ్వబడుతున్నవి.

ASAFIYAH STATE LIBRARY HYDERABAD

నేపాలుకు ఇండియా సహాయ కార్యక్రమం

ఖట్మండూ, జూన్ 24

నేపాలుకు ఇండియా సహాయ కార్యక్రమాన్ని గురించి నేపాలులోని ఇండియా రాయబారి శ్రీ గోఖేల్ పత్రికా విలేఖరుల సమావేశంలో ఈ క్రింది విషయాలు చెప్పారు.

'ఐక్యరాజ్య సమితి, ప్రపంచ వైజ్ఞానికసంఘం, ప్రపంచ ఆరోగ్య సంస్థ' ప్రపంచ వ్యవసాయ సంస్థలలో నేపాలుకు సభ్యత్వం కల్గించడానికి ఇండియా తీవ్రంగా కృషి చేసింది. నేపాలు కోరినప్పుడల్లా ఇండియా సహాయంచేస్తున్నది. ఇండియాలో గత సంవత్సరం నేపాల్ విద్యార్థులకు ఇండియా ప్రభుత్వం 90 స్కాలర్ షిప్పులను గతసంవత్సరం ఇచ్చినది. ఈ సంవత్సరం 155 స్కాలర్ షిప్పులను ఇచ్చింది.

నేపాల్ ప్రభుత్వాహ్వానంపై కొంతమంది భారతీయ భూగర్భ శాస్త్రజ్ఞులు కొన్ని పరిశీలనలు జరిపారు. గౌచర్ విమానాశ్రయాన్ని నిర్మించడానికి 15 లక్షలు ఖర్చుపెట్టింది. మైనరు ఇరిగేషన్ స్కీములకు 60 లక్షల రూపాయలను గ్రాంటుగా ఇచ్చింది. నేపాలులోని భారతీయ సైనిక ప్రతినిధివర్గం పునర్నిర్మాణ కార్యక్రమాన్ని పూర్తి చేసింది. ప్రజల సౌకర్యార్థం కోసీప్రాజెక్టు తలపెట్టబడినందున నేపాల్ ప్రాంతంలోని స్థలానికి ఇండియా ప్రభుత్వం పరిహారాన్ని చెల్లించింది. నేపాల్ ఆంతరంగిక వ్యవహారాలలో ఇండియాజోక్యం కలిగించుకోడం అవసరమని కోరితే సహాయం చేయడానికి ఇండియా సిద్ధంగా వున్నది.'

పెరంబూరు రైలుపెట్టెల కర్మాగారం

పార్లమెంటు సభ్యులరాక

మద్రాసు, జూన్ 24

దక్షిణ ఇండియాలోని జాతీయ కర్మాగారాలను దర్శించడానికి వచ్చిన 9 మంది పార్లమెంటు సభ్యులు నేడు పెరంబూరులోని రైలుపెట్టెల నిర్మాణ కర్మాగారాన్ని దర్శించారు. శ్రీరఘుధీర్ సింగ్, బాద్ పాసుప్త, సోహన్ లాల్ దూసియా, ఎ. ఆర్. శేవాల్, అజిత్ సింధు, నగాల్ ప్రభాకర్ తేజసింగు, డాక్టర్ వి. కె. సత్యవాణి, శ్రీపన్నాలాల్ బారుపాల్ పైనార్సి వున్నారు. ఆ కర్మాగారంలోని సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని కూడా వారుదర్శించారు. ఆ కర్మాగారంలో సాధించబడిన అభివృద్ధిని వారు ప్రశంసించారు.

కామరాజ నాడార్

మద్రాసు, జూన్ 24

మద్రాస్ ముఖ్యమంత్రి కామరాజ నాడార్ పక్షాన నామినేషన్ పత్రాలు నేడు తిరువత్తూర్ వద్ద రిటర్నింగ్ ఆఫీసర్‌కు అందచేయబడినవి. శ్రీకామరాజ నాడార్ రాష్ట్రశాసనసభయొక్క సభ్యుడుకాడు. ఇతను మద్రాస్ అసెంబ్లీయొక్క గుడియాత్తమ్ ద్విసభ్య నియోజకవర్గంనుండి జనరల్ సీటుకు కాంగ్రెస్ పక్షాన పోటీచేస్తున్నారు.

కామరాజ నాడార్ పక్షాన మొత్తం అయిదు సెట్లు నామినేషన్ పేపర్లు దాఖల్ చేయబడినవి. (యు.పి.ఐ)

ఆంధ్ర అసెంబ్లీ స్పీకర్ రాక

హైద్రాబాద్, జూన్ 24

ఆంధ్రశాసనసభ స్పీకరు శ్రీ నల్లపాటి వెంకట్రాయుయ్య, డిప్యూటీ స్పీకరు శ్రీ పసల సూర్య చంద్రరావు గారలు శ్రీనగర్‌లో స్పీకర్ల మహాసభకు హాజరై తిరిగివస్తూ నిన్న హైద్రాబాద్ వచ్చారు. వీరు రైలులో నేడు కర్నూలు బయలుదేరి వెడుతారు.

శ్రీ దామోదర్ సత్వలేకర్

హయిద్రాబాదు, జూన్ 24

శ్రీపాద్ దామోదర్ సత్వలేకర్ (స్వాధ్యాయమండల్ అధ్యక్షులు) సంస్కృత భాషా ప్రచారసమితి, పూర్ణ అధ్యక్షులు హయిదరాబాదు వచ్చారు. ఒక వారంపాటు వీరు యిక్కడ పర్యటన జరుపుతారు. ఈయన తన సోదరుడును, విశేకవర్ధని కాలేజి ప్రిన్సిపాల్‌ను అగు డాక్టరు సత్వలేకర్ గారి వద్దనుంటున్నారు.

గోలకొండపత్రిక

జయ సం॥ జ్యేష్ఠ॥ బు॥ ౧౦ శుక్రవారం

నెహ్రూ-చౌ ఎన్ లే సంప్రదింపులు

భారత ప్రభుత్వ ఆహ్వానంపై నేడు ఢిల్లీకి జెనీవానుండి పెకింగ్‌కు వెళ్ళుతున్న చైనా ప్రజా రిపబ్లిక్ ప్రధాని చౌ ఎన్ లే వస్తున్నారు. వీరి రాక భారత ప్రజానీకానికి సంతోషదాయకమైనదని ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరం లేదు. ఉభయదేశాలు పరస్పరం సుహృద్భావ సౌమనస్యాలుకలిగి వ్యవహరిస్తూ ఆసియా శాంతికి, ప్రపంచ శాంతికి ప్రబల దోహదకారిగా ఉంటున్నవి. నేడు అంతర్జాతీయ పరిస్థితులు అతి క్లిష్టంగా ఉండి, ఇండోచైనా సమస్య ప్రాధాన్యాన్ని వహిస్తున్నందున ఈ సమస్య పట్ల అధిక ఆసక్తిగల ఇండియా, చైనాదేశాల ప్రధానులు సమావేశమవుతుండటం, ఇతర రాజ్యాలకు ప్రత్యేకంగా ప్రపంచశాంతిని కోరేవారందరికి అత్యంత ఆసక్తిదాయకమైనది;

ఢిల్లీలో చైనా ప్రధాని చౌ ఎన్ లే దాదాపు మూడు రోజులపాటు ఉండగలరని తెలుస్తున్నది. శ్రీ నెహ్రూ మరియు చైనాప్రధాని ప్రపంచసమస్యలన్నింటిపైనా చర్చలు జరుపగలరని తలచవచ్చును. భారతదేశము ప్రజాస్వామిక దేశము; శాంతియుత పద్ధతులద్వారా అభివృద్ధిని సాధిస్తూ పురోగమిస్తున్నది. చైనా ప్రజారిపబ్లిక్ కమ్యూనిస్టు రాజ్యము. ఈ రెండూ విభిన్న దృక్పథములుకల దేశములయినా పరస్పరం సన్నిహితత్వంతో మనగలుగుతూ ప్రపంచ రాజ్యాలకు ఒక ఆదర్శాన్ని సృష్టిస్తున్నవి, నేటి సంక్షుభిత ప్రపంచానికి మార్గాన్ని చూపుతున్నవి.

చైనా భారతదేశాల మధ్య నేడు మిగిలిఉన్న వివాదాలేమీ లేవు. ఇవి టిబెట్‌పై సంతృప్తికరమైన ఒప్పందానికి రాగలిగి వీటి మధ్య పొరుపులను ఆశించిన దేశాలకు ఆశ్చర్యాన్ని భంగపాటునుసృష్టించినవి. స్వాతంత్ర్యం, సమానత్వం ప్రాతిపదికగా పరస్పర స్వాతంత్ర్యాన్ని, రాజకీయ సంఘటితత్వాన్ని గౌరవించుకొంటున్నందు వల్లనే వీటి స్నేహం దినదినం ఇనుమడిస్తున్నది. ఇతర రాజ్యాలుగూడా ఇదే విధంగా తమ మధ్య గల సమస్యల పరిష్కరించుకొన వచ్చునని టిబెట్‌పై జరిగిన ఒడంబడిక రుజువు చేస్తున్నది.

చైనా మరియు భారత ప్రధానుల సమావేశం జరుగుతుండటం ఇదే తొలిసారి. ఈ తొలి సమావేశం ఇట్టి సమావేశాలు పెక్కు జరుగుటకు కారణభూతమవగలదని పేర్కొనవచ్చును. భారతదేశము జనాభా 36 కోట్లు. చైనా జనాభా 60 కోట్లు. వీటికి ఈ అపారమైన అంగబలం ప్రపంచశాంతికి దోహదమివ్వడంలో అధిక ప్రాబల్యమును కలిగిఉన్నది. వీటి స్నేహం ఇనుమడించటం ఆసియాలో శాంతి పరిపోషణకు పెట్టనికోట కాగలదు. గత నాలుగయిదు సంవత్సరాలనుండి ఉభయదేశాలు పరస్పరం సుహృద్భావ ప్రతినిధివర్గాల పంపుకొని పరస్పరం సంబంధాల సన్నిహితం చేసుకొంటున్నవి. భారతదేశము ప్రపంచసంస్థ అగు సంయుక్తరాజ్య సమితిలో చైనాకు సభ్యత్వము లభించవలెనని, చైనా ప్రజారిపబ్లిక్‌ను గుర్తింపనిది దూరప్రాచ్యంలో శాంతి పరిపోషణ కాని దూరప్రాచ్య సమస్యల సక్రమ పరిష్కారంగాని సంభవం కాదని వాదిస్తూ అమెరికా మరియు దాని ఉపగ్రహరాజ్యాలలో పరివర్తనాన్ని కలిగించుటకు కృషిచేస్తున్నది.

ఫ్రాన్సులో లానియల్ మంత్రివర్గం పతనమై మెండాస్ ఫ్రాన్సు అధికారంలోనికి వచ్చిన తర్వాత ఇండోచైనా సమస్య పరిష్కారపు అవకాశాలు అధికమైనవే కాని తగ్గలేదు. చౌ ఎన్ లే ఇండోచైనా సమస్యనుగూర్చి ఫ్రాన్సుయొక్క నూతనప్రధానితో సంప్రదింపులనుజరిపే నేడు ఢిల్లీకి వస్తున్నారు. కావున శ్రీ నెహ్రూ మరియు వీరియొక్క సమావేశమునకు మరికొంత ప్రాధాన్యము ఏర్పడుతున్నది. ఇండోచైనా సమస్యా పరిష్కారానికి భారత ప్రధాని సూచించిన షటసూత్ర ప్రణాళికను చైనా బలపరచడమే కాక యుద్ధవిరమణ జరిగిన తర్వాతనే శాంతియుత వాతావరణంలో ఇండోచైనా సమస్యపై సంప్రతింపులు జరిపి పరిష్కారాన్ని సాధించడం సాధ్యమని భావిస్తున్నది.

నెహ్రూ-చౌ ఎన్ లే సంప్రదింపులు ప్రపంచశాంతికి నిస్సందేహంగా దోహదమివ్వగలవని ఇండోచైనా సమస్యా పరిష్కారానికి దూరప్రాచ్యంలో శాంతి పరిపోషణకు తోడ్పడగలవని విశ్వసింపవచ్చును. వీరి సమావేశం ఉభయదేశాల స్నేహాన్ని ఇనుమడింప చేయడంలో ప్రధానఘట్టం కావలెనని కాంక్షిస్తున్నాం.

బర్మా ప్రభుత్వ సైనిక యూనిట్

తిరుగుబాటుదారుల దాడి

రంగూన్, జూన్ 24

రెండువందల మంది బర్మాకమ్యూనిస్టులు పంచమాంగ దళపు సహాయముతో రంగూన్‌కు మూడువందల మైళ్ళ ఉత్తరమునగల మెక్టిలావద్ద గల బర్మా సైనిక సాయుధ యూనిట్‌పై దాడిచేసి చాలా మందుగుండు సామగ్రిని ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. ఈ తిరుగుబాటు దారులు విజయవంతంగా ప్రభుత్వ సైనికయూనిటుపై దాడిచేయ గలిగినారు. బయటి నుండి కమ్యూనిస్టులు దాడి చేయగా లోనుండి పంచమాంగ దళంవారు తమ కామ్రేడ్లపై దాడి చేయడం జరిగినది.

పశ్చిమ బెంగాల్‌లో రోడ్ల అభివృద్ధి

కేంద్రంచే రు. 13.85 కోట్ల గ్రాంటు

కలకత్తా, జూన్ 24

1953లో రోడ్డుపంచవర్ష ప్రణాళిక పూర్తి అయిన తర్వాత పశ్చిమ బెంగాల్ దాదాపు 5 వేల మైళ్ళరోడ్లను పొందగలదు. అవిభక్త బెంగాల్‌నుండి పశ్చిమ బెంగాల్‌కు 12 వందలమైళ్ళరోడ్లు సంక్రమించినవి.

పశ్చిమ బెంగాల్‌కు 13.85 కోట్ల రూపాయలను రోడ్ల అభివృద్ధి ప్రణాళికకై కేంద్రప్రభుత్వం మంజూరు జేసినది. 1951లో పశ్చిమబెంగాల్ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పైమొత్తంకాక స్వంతనుండి రు.16 కోట్లను రోడ్ల అభివృద్ధికి వ్యయపరచగలదు. (యు.పి. ఐ)

గ్వాటిమాలా పరిస్థితి

క్లిష్టతరంగా ఉన్నటుల వార్తలు

మెక్సికోనగరం జూన్ 23

తాజాగాఅందుతున్నసమాచారాలు గ్వాటిమాలా పరిస్థితి గంద్రగోళంగా ఉన్నదని తెలుపుతున్నవి. ఇక్కడ ఉన్న విచిత్ర మేమిటంటే ఉభయపక్షాలు ప్రసిడెంట్ జాన్ జాకబ్ ఆర్బెంజ్‌కు తమ విశ్వాసాన్ని ప్రకటిస్తున్నవి.

తిరుగుబాటుదారులు తాము గ్వాటిమాలా నగరాన్ని స్వాధీనం చేసుకొన్నటుల ప్రకటించారు. దీనినిప్రభుత్వం ఖండించినది. (యు. పి. ఐ)

గోవా ప్రభుత్వ చర్య

విద్యార్థుల తమవైపు త్రిప్పుకొనడానికి

బొంబాయి, జూన్ 24

భారతదేశానికి గోవానుండినిర్యాత్థులు రాకుండా చేయుటకై పోర్చుగీస్ ప్రభుత్వం క్రొత్తనిబంధనల ప్రవేశపెట్టడంద్వారా నిర్బంధంగా గోవా కోర్సులు చదివించేలా చేస్తున్నది.

లిస్బన్‌లోని విద్యాడైరెక్టొరేట్ జనరల్‌యొక్క ఇటీవలి డిక్రీద్వారా భారత విశ్వవిద్యాలయములో ఎస్. ఎస్. సి. పరీక్షలో ఉత్తీర్ణులయిన గోవా విద్యార్థులు పోర్చుగీస్ కళాశాలకోర్సులను పూర్తి చేయవలసి ఉంటుంది.

వియత్ మిన్ స్థావరాలపైదాడులు

హనోయ్, జూన్ 24

హనోయికి 25మైళ్ళ తూర్పునగల అయిదు వియత్ మిన్ స్థావరాలపై విమానదాడులు జరుపబడినవి. బాంబులు కురిపింపబడినవి. ఈ గ్రామాలపై మొత్తం వేయబడిన బాంబులు 62 టన్నుల అయిదువందలపౌనులు మొదలు విమానదాడులకు ముందుగా కరపత్రాలు వెదజల్లబడినవి.

యు.పి.ఐ.

బొంబాయి రాష్ట్రంలో బియ్యంపై కంట్రోలు రద్దు

న్యూఢిల్లీ, జూన్ 24

బొంబాయి రాష్ట్రంలో బియ్యంపై కంటోలులొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున కేంద్ర ప్రభుత్వనిలవలలోని బర్మాబియ్యాన్ని (దిగుమతి చేయబడిన) బొంబాయి రాష్ట్రంలోని రైతులకు పంపిణీ చేయబడిన బియ్యం వ్యాపారులకు ఇండియా ప్రభుత్వమే విక్రయిస్తుంది.

ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుని ఎన్నిక

ఇంతవరకు ఒక్క నామినేషన్ కూడ లేని వైనం

హయిద్రాబాద్, జూన్ 23

జూలై 10వ తేదీన జరుగనున్న ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షు ఎన్నికకు నామినేషన్లు తీసుకొని గడువు 24 గంటలే ఉండగా నేటి సాయింత్రంవరకు కాంగ్రెసు కార్యాలయానికి దరఖాస్తు లేవీ చేరలేదు.

(తాజావార్త పేరుగా ప్రకటించబడింది.)

ప్రస్తుతం ప్రారంభించబడిన 'ఐక్యతా ఉద్యమ' ఫలితం ఏమైనదీ కాంగ్రెసు వర్గాలు చేప్పడంలేదా 'వేచి చూడండి'' అని కొందరు ప్రముఖులు చెబుతున్నారు.

తుపాకిమందు తయారు చేస్తున్నవారి అరెస్టు

హయిద్రాబాద్, జూన్ 23

సిటీ పోలీసులు నిన్న కుప్పచాబుట్రికు చెందిన యిద్దరిని అరెస్టు చేశారు. వీరు దొంగతనంగా తుపాకిమందు తయారుచేస్తున్నారు. నిందితులనుండి పోలీసులు 11 శేర్ల మందు సామగ్రిని స్వాధీనం చేసుకొన్నారు. (ఎ. ఎన్. ఎస్.)

సమావేశం వాయిదా

హయిద్రాబాదు, జూన్ 24

రాష్ట్ర అధికారులు, పనులపై దర్యాప్తు కమీషన్‌లనుధ్యానుస్తున్న హయిద్రాబాదురాష్ట్ర మెమోరాండముపై చర్చలనిమిత్తం జూన్ 22 న నిర్ణయించబడిన సమావేశంతరువాత మరియొక రోజుకు మార్చబడింది.

ఈ సమావేశం బహుశా జులైమాసములో జరుగగలదు. (ఎ.ఎన్.ఎస్)

హైద్రాబాద్ బారిష్టర్ లండన్ ప్రయాణం

హయిద్రాబాద్, జూన్ 24

హైద్రాబాద్ ప్రముఖ బారిష్టర్ మిస్టర్ అతర్ రహ్మాన్, రెండు రోజుల క్రింద లండన్ వెళ్ళారు. ప్రపంచన్యాయవాదుల సమావేశంలో వీరు పాల్గొంటారు. ఈ సమావేశం జూలైలో మాంట్ కార్లో(ఫ్రాన్స్)లో జరుగుతుంది. ఎడింబరోలో కూడా జరుగనున్న ప్రపంచ న్యాయవాదుల సభకు కూడ వీరు హాజరు కాగలరు.

సెప్టెంబర్ మొదటివారంలో వీరు తిరిగి హైద్రాబాద్ చేరుకుంటారు.

(ఎ. ఎన్. ఎస్)

బందిపోటుదొంగకుశిక్షతగ్గింపు

హయిదరాబాద్, జూన్ 24

హైద్రాబాద్ హైకోర్టు, డివిజనల్ బెంచ్, నానిగాడు అను ఒక కమ్యూనిస్టు బందిపోటుకొన్న అప్పీలు సుకొంత ఆమోదించింది. ఈతనికి హైద్రాబాద్ మేజిస్ట్రేట్ చే 7 సం॥ కఠిన శిక్ష విధించ బడింది.

ప్రాసిక్యూషన్ ప్రకారం, నిందితుడు కమ్యూనిస్టుపార్టికి చెందినవాడు 15 మంది యితరుల సహాయంతో 42 పశువులను మాధరామ్ (యెల్లందు తాలూకా) నుండి తస్కరించాడు. తరువాత మేజిస్ట్రేట్ గారు శిక్షనుతగ్గించారు. (ఎ. ఎన్. ఎస్.)

సింద్రీ ఎరువుల ఫ్యాక్టరీ

సికింద్రాబాదు, జూన్ 24

ఇండోనీషియా ప్రభుత్వపు ఆర్థిక వ్యవహారాల మంత్రాంగపు ఉటోజో సుటోటో మరియు ప్లానింగ్ బ్యూరో డైరెక్టర్ డా॥ జుండా సోమవారము నాడు సింద్రీకివచ్చారు. ఇక్కడిఎరువులఫ్యాక్టరీని పట్టణాన్ని దర్శించారు.

వీరు ఇండియా పంచవర్ష ప్రణాళిక సాధించిన అభివృద్ధిని పరిశీలించుటకై పర్యటిస్తున్నారు. వీరి నెంటు ఢిల్లీలోని ఇండోనీషియా రాయబారికార్యాలయ అధికారి మరియు భారతప్రభుత్వ ప్లానింగ్‌కమీషన్‌కుచెందిన డా॥ ఎస్. కె. ధార్ వచ్చారు. (యు. పి. ఐ)

కాందిశీకుల పునరావాసం

న్యూఢిల్లీ, జూన్ 24

త్రిపురా చీఫ్ కమీషనర్ అధీనములో కేంద్రపురావాస మంత్రాంగం తూర్పు బెంగాల్ నుండివచ్చిన కాందిశీకులకు అప్పులుగా, యివ్వడానికి యీ సంవత్సరం 32 లక్షల రూపాయలను ఉంచినది. ఈ ఆర్థిక సంవత్సరంనందు ఈమొత్తము వ్యయపరచబడ గలదు.

వెస్టర్న్ ఇండియా లైఫు ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్

(సతారా)

పై సంస్థ యొక్క నలుబదియవ వార్షికమహాసభ 20 జూన్ 1954 నాడు సమావేశమైంది. కంపెనీయొక్క 1953 సంవత్సరపు లెక్కలు, బ్యాలెన్సుషీటు అంగీకరింపబడ్డది. అధ్యక్షుడు డాక్టర్ ఎం. ఎక్, ఆగాషే, ఎం. బి. బి. ఎస్. ఇలా అన్నారు.

"మనదేశమందు వ్యాపించియున్న నిరుద్యోగము, అధికధరలు జీవితవ్యయ భారము దృష్టియం దుంచుకుంటే, మన కంపెనీ చేసిన వ్యాపారాభివృద్ధి తృప్తికరముగానే యుండినదని చెప్పవచ్చును. 1952 సంవత్సరములో మన క్రొత్త వ్యాపారము 2 కోట్ల 69 లక్షలుండగా, 1953 సంవత్సరంలో 2కోట్ల 76 లక్షలైంది. సామాన్య ఖర్చులతోనే ఈ అధికాన్ని గడించాము గత అయిదు సంవత్సరాలతో పోల్చిచూస్తే, మరణముల సంఖ్య తక్కువ - నుండెననియు, రావలసిన పైకము అధికముగానే వచ్చినదనియు. ఖర్చులు మాత్రము అధికం కాలేదనియు గోచరిస్తున్నది. కనుక నిర్మాణాత్మకంగా నాలోచించి, ఇంతవరకే తగ్గింపబడిన రేట్లను 1-4-1954 నుండి ఇంకా తగ్గించుటకు తీర్మానించినాము. ఎంప్లాయీస్ ప్రావిడెంటు ఫండు మొదలగు ఇతర స్కీముల సహాయముతో. వచ్చే సంవత్సరములో యింకా వ్యాపారాభివృద్ధి కాగలదని ఆశిస్తున్నాము. ఈ నివేదిక సంవత్సరంలో మన లైఫ్ ఫండుకు 72 లక్షల రూపాయలు చేర్చబడ్డవి. అనగా అది ఇప్పుడు 5 కోట్ల 33 లక్షలైంది. క్లెయిముల బాబుకు 27 లక్షలు ఇచ్చివేశాము. కంపెనీయొక్క విలువ కట్టబడుచున్నది దానికటివలెనే తృప్తిగా నుండగలదని తలంచుచున్నాము. ఈ సంవత్సరము ఇంకొక క్రొత్తబిల్డింగు పూర్తి చేయబడి డాక్టరు రాధాకృష్ణన్ రిచే తెరువబడ్డది. కొలహాపూరులో ఒక బిల్డింగు కొని తగు మార్పులు చేయించాము. ఈకంపెనికున్న పూర్వప్రతిష్ఠను చక్కగా నిలుపుకొనుచున్నది. దీనికై కార్యనిర్వాహక వరమును అభినందించుచున్నాను.

క్యాష్ గ్రాంట్లను రద్దుపరచరాదు

హయిద్రాబాదు, జూన్ 24

క్యాష్‌గ్రాంట్లు పొందుతున్నవారి కేంద్రసంఘసభ్యులు జులై 20 న హైదరాబాదులో ఒకసమావేశాన్నేర్పాటు చేసి కొన్ని తీర్మానాలను గావించారు.

క్యాష్‌గ్రాంట్లను రద్దుపరుస్తూహైదరాబాదు లెజిస్లేటివ్ అసెంబ్లీఆమోదించిన బిల్లునువ్యతిరేకిస్తూ ఒకమెమొరాండాన్ని భారతరిపబ్లిక్ అధ్యక్షునికి పంపాలని చేయబడిన తీర్మానం సర్వసభ్యుల ఆమోదాన్ని పొందింది.

ఈ మెమొరాండంలో ఈ బిల్లును రద్దుపరచాలనియు, తద్వారా క్యాష్ గ్రాంట్లుపొందుతున్నవారి జీవితాలను ఉద్ధరించాలనియు రాష్ట్రపతిని కోరనైనది.

రాష్ట్రప్రభుత్వం క్యాషు గ్రాంట్లను రాష్ట్రప్రభుత్వం జూలై 1 నుండిబిల్లు రిపబ్లిక్ అధ్యక్షుని ఆమోదంపొందకముందే రద్దుపరచగలదు. అధ్యక్షుడు రాష్ట్రప్రభుత్వం ఈచర్యతీసుకోకుండా చూడాలని కూడా ఈ సభలో కోరబడినది.

పొగాకు పరిశోధనా సంస్థ

కొత్తఢిల్లీ, జూన్ 24

సిగరెట్ల పొగాకుపై పరిశోధనకై ఒకసంస్థను ఏర్పరచుటకు మైసూర్ ప్రభుత్వం ఆలోచిస్తున్నది. వృథాగా పారవేసేచెత్తపొగాకునుండి నికోటైన్ తీయబడగలదు.

[యు.పి.ఐ,]

జాతీయవిస్తరణ కార్యక్రమం

ఔరంగాబాద్ జిల్లాలో అభివృద్ధి

ఔరంగాబాద్, జూన్ 24

1954 సంవత్సరానికి ప్రాజక్టుఅడ్వయిజరీ కమిటీ ఔరంగాబాదు జిల్లాకు గాను అయిదులక్షలరూపాయల జాతీయ విస్తరణ పనులు మంజూరు చేయబడినవి.

ఈ అయిదు లక్షల రూపాయల వ్యయముతో ప్రాథమిక పాఠశాలలు గ్రామపు రోడ్లు, కాల్వలు, బావుల నిర్మాణం, చిన్న కుంటల-చెరువుల మరమ్మత్తు జరుపబడగలదు. మార్చి నుండి మే వరకు మూడునెలలలో ఈ జిల్లాకుచెందిన వివిధ గ్రామములందు రూ. 40 వేల పనులు పూర్తిచేయబడినవి. గ్రామాలఅభివృద్ధికి ప్రజలుఅధిక ఆసక్తి చూపుతున్నారని, ఖరీఫ్‌పంటల కొరకై మంచిరకపు విత్తనాలు ఎరువులు దాదాపు 20 వేల ఎకరాలకు సరిపోవునట్లుగా ఇవ్వబడినవని కలెక్టర్ యస్. కె. సిన్హా తెలిపారు.

(యు.పి.ఐ)

కలెక్టర్‌పై దౌర్జన్య ప్రయత్నం

మాజీసైనికుని అరెస్టు

నిజామాబాదు, జూన్ 24

తొలగించబడిన సైనికుడైన జహేదీ అలీ నిన్న నిజామాబాదు కలెక్టర్‌పై దౌర్జన్యంచేయబోయి అరెస్టయినాడు.

భూమికొరకు యితడు కలెక్టరుకు దరఖాస్తుపెట్టాడని, అతని దరఖాస్తు అతనిప్రాంతములోని తహసీల్‌దారుకు పంపించబడిందని తెలుస్తున్నది. కాని వెంటనే కలెక్టర్ ఉత్తర్వులుజారీచేసి భూమిని తనకు స్వాధీనముచేయాలని అతడు పట్టుబట్టాడు. అతడు చప్రాసీలను త్రోసివేసి కలవరాన్ని కలిగించినాడు. వెంటనే పోలీసులురప్పించబడినారు. అతడు అరెస్టుచేయబడినాడు.

కేంద్రమంత్రితో ఇంటర్వ్యూ నిరాకరణ

బీదరు కాంగ్రెసు నాయకుడు శ్రీజోషి ఆరోపణపై విచారణ

ఔరంగాబాదు, జూన్ 24

బీడ్ జిల్లా కాంగ్రెసు నాయకుడు శ్రీ నారాయణరావు జోషీతో తనకు ఇంటర్వ్యూ జరగకుండా జరిగిన పరిస్థితిని దర్యాప్తుచేయవలసిందిగా కేంద్ర హోంశాఖ ఉపమంత్రి శ్రీ బి. ఎన్. దాతార్ పోలీసు అధికారులకు ఉత్తర్వు చేశారు.

శ్రీ జోషీ ఇంతకుముందు కేంద్ర ఉపమంత్రి సన్మానానికి అన్నివిధాలుగా చేయవలసిందిగా కోరబడినాడు. కాని తరువాత ఉత్తర్వులురద్దుచేయబడి శ్రీ జోషీ ఆయన్ను కలువకుండా నిరోధించబడ్డారు.

అయినా శ్రీ జోషీ ఏదో విధంగా శ్రీ దాతారునుకలిసి ఈవిషయాలపై ఫిర్యాదుచేశారు.

బ్రూదరుల అరెస్టు

సికింద్రాబాద్, జూన్ 24

మునిసిఫ్ మేజిస్ట్రేట్ శ్రీ ఎ. శంకర్ రెడ్డి నిన్న 8 మందిని నిందితులుగా గుర్తించి సెక్షన్ 5 గ్యాంబ్లింగ్ ఆక్టు ప్రకారం చెరి రు. 4 చొప్పున జరిమాన విధించారు.

నిందితులు ధాన్ బజార్‌లోని ఒక గృహంలో జూదమాడుతున్న సమయంలో కాంగోపాల్‌పేట పోలీసులు అరెస్టుచేశారు. రు. 52/లు పట్టుబడినవి. ఎ. ఎన్ ఎస్

కోన్యాప్రాజక్టు

నిర్మాణ పరిశీలనకు బోర్డు నిర్మాణం

బొంబాయి, జూన్ 24

పబ్లిక్ వర్క్సు మంత్రి ఎస్. ఎమ్. నాయక్ నింబాల్కర్ అధ్యక్షతన బొంబాయి ప్రభుత్వం కోన్యాప్రాజక్టు నిర్మాణాన్ని సూపర్‌వైస్ చేయుటకు ఒకబోర్డును ఏర్పరచినది. ఈ ప్రాజక్టుకు సంబంధించినపనుల వివిధ ప్రభుత్వడిపార్టుమెంటులు త్వరగాపూర్తిచేయుటకు ప్రభుత్వము ఆదేశించినది. కోన్యా హయిడ్రోఎలక్ట్రిక్ ప్రాజక్టుపై ప్రథమస్థాయిలో రు. 32. 22కోట్లు ఖర్చు కాగలదు. యు. పి. ఐ

లేఖావళి

తెలంగాణభవితవ్యత

ఆర్యా!

రాష్ట్రంలోని తెలుగు ప్రజలలో అధికసంఖ్యాకులు విశాలాంధ్ర నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రెండు తెలుగు రాష్ట్రాలను కోరుతున్నారని నేటిపత్రికలలో మీ ప్రత్యేక విలేఖరివ్రాసిన విషయం తెలంగాణప్రజల హృదయాన్ని ప్రతిబింబిస్తున్నది.

ఒక్క హయిద్రాబాదు నగరములోనేగాక వరంగల్ మున్నగుచోట్ల కూడ గైరుముల్కీలు చాలమంది ఉన్నారు. విశాలాంధ్రమువస్తే వీరి సంఖ్య మరింత పెరిగిపోయి స్థానికులకు ఈ మాత్రం ఉద్యోగాలుకూడ దొరకవు. అదీగాక ఆంధ్రరాష్ట్రమునుండి వచ్చిన ధనికులు యిక్కడిభూములన్ని కొనివేసి తెలంగాణప్రజలకు మరింత అన్యాయంచేయగలరు.

స్థానికప్రజల హక్కులకై జరిగిన ముల్కీఉద్యమాన్ని బలపరిచిన మీరు ఈపరిస్థితులన్నియు తెలిసియుండియు విశాలాంధ్ర నిర్మాణాన్ని ఎందులకు సమర్థిస్తున్నారో తెలియదు. సాహిత్యాభివృద్ధి దృష్ట్యా మీరు మీ సంపాదకీయాలలో విశాలాంధ్రం ఏర్పడాలని కోరుతుండవచ్చును. కాని తెలంగాణ హృదయం మీకు పూర్తిగా తెలుసు. తెలంగాణ ఏకైకవాణిఅయిన గోలకొండ ఇంకనూ విశాలాంధ్రనిర్మాణాన్ని బలపరచడం చాలమందికి కష్టం కలిగిస్తున్నది.

పూజ్యులైన శ్రీ కొండా వెంకటరంగారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు ప్రభృతులు విశాలాంధ్రను వ్యతిరేకిస్తున్నారంటే వారు తెలంగాణక్షేమాన్ని బాగుగాదృష్టిలో ఉంచుకున్నారనే భావిస్తున్నాము. విశాలాంధ్రము తెలంగాణకు నిజముగా లాభదాయకమయితే వారు విశాలాంధ్రను వ్యతిరేకించియుండరు.

వరంగల్‌లో విశాలాంధ్ర మహాసభ అధ్యక్షునికిజరిగిన పరాభవము అందరికీ తెలిసినదేను. విశాలాంధ్రీవాంఛ ఆంధ్రరాష్ట్రం వారిలో ఎంత ప్రగాఢంగాఉందో తెలంగాణీయులలో విశాలాంధ్ర వ్యతిరేకత అంతప్రగాఢంగాను ఉండనేది స్పష్టము.

ఇంకనూ వ్రాయవలసిలేదు. మీరు రెండు తెలుగురాష్ట్రాల వాదాన్ని బలపరచాలని కోరుతున్నాను.

వరంగల్ 22-6-54 | ఇట్లు ఒకవరంగల్ పౌరుడు

అపహృతుల సముద్ధరణ

ఉభయ ప్రభుత్వాలు తీసుకొనవలసిన నిర్ణయాలు

కొత్తఢిల్లీ, జూన్ 24

1954 మే 6, 7, 8 తేదులలో పాకిస్థాన్ ఇండియా ప్రభుత్వ ప్రతినిధులు సమావేశమై అపహృత స్త్రీల సముద్ధరణకై చేసిన నిర్ణయాల ఉభయ ప్రభుత్వములు ధృవపరచినవి. ఈ ప్రభుత్వాలు ధృవపరచిన కొన్ని ముఖ్యమయిన నిర్ణయాలు [1] రెండు దేశాలలో మిగిలిఉన్న అపహృత స్త్రీల సముద్ధరణ కార్యక్రమమును పూర్తి చేయుటకై ఇరు ప్రభుత్వాల ఉన్నతాధికారులు ఇరువురు ఈ దేశాల పర్యటించి ఆయా ప్రభుత్వాలకు సత్వరమే తీసుకొనదగిన చర్యల సిఫారసు చేయవలెను. [2] అపహృతులు జాడలు తెలుసుకొనుటకై వారి బంధువులకు ఉభయ ప్రభుత్వాలు రవాణా సౌకర్యాల కల్పించవలెను. [3] విదేశాలకు పంపబడిన అపహృతుల రాబట్టుటకై ప్రభుత్వాలు ప్రయత్నించవలెను. [4] రెండుదేశాలలో వీరికై ప్రత్యేక గృహముల ఏర్పాటుచేయవలెను; [5] అపహృతుల కోర్కెలను ప్రభుత్వాలు సానుభూతి పూర్వకంగా పరిశీలింపవలెను. యు. పి, ఐ

శాంతికూటమి

ప్రపంచంలో మూడవదని భారతీయుల అభిప్రాయం

బర్లిన్, జూన్ 24

నేడు ప్రపంచం రెండు శిబిరాలలోగాదు, మూడింటిలో విభజనయై ఉన్నదని బర్లిన్‌లోని జర్నలిస్టులతో మాట్లాడుతూ భారతీయపత్రికా రచయితలు ఇక్కడపేర్కొన్నారు.

ది తాతా ఆయిల్ మిల్స్ కం. లి॥

ఇండియన్ సోప్ అండ్ టాయిలెట్రీ మేకర్స్ ఎసోసియేషన్ సభ్యులు.

టెండర్లు

1. హైదరాబాదు, బెంగుళూరు రోడ్ (నేషనల్ హైవే నెం. 7) 20 వ మైలు నుండి 50 వ మైలు వరకు బ్యాంకింగు డాంబరురోడ్డు నిర్మాణము కొరకు రిజిస్టర్డు "ఎ" క్లాసు కంట్రాక్టర్లు మాత్రమే టెండరు పెట్టవలెను.
2. ఎస్టిమేటు విలువ ఐ. జి. రూ. 5,13,000
   కంట్రాక్టు విలువ ,, 4,08,729
   ధరావతు రకం ,, 8,175
3. పని మొదలుచేయవలసిన తేదీ ... 29-2-1956.
4. టెండర్లు మరియు షెడ్యూలు ఫారములు ఎక్జిక్యూటివ్ ఇంజనీయర్ పి. డబ్ల్యు. డి. (ఆర్ అండ్ బి) మహబూబునగరంజిల్లా కార్యాలయములో, పనిచేసే యేరోజుఅయినా 3-7-1954 తేదీవరకు దొరకగలవు.
5. టెండర్లు 5-7-1954, 14 గంటలలోగా చేరవలెను. టెండర్లు 5-7-1954 గం. 15-30 లకు ఎక్జిక్యూటివు ఇంజనీయరుగారిచే కంట్రాక్టర్లు లేక వారి యేజంట్లయెదుట తెరువబడును.
6. ఇతర వివరములు ఎగ్జిక్యూటివు ఇంజనీయర్ పి. డబ్ల్యు. డి. "ఆర్ అండ్ బి" కార్యాలయములో, పనిచేసే యేరోజునైనా 3-7-1954 వరకు తెలుసుకొనగలరు.

సం. ఎక్జిక్యూటివు ఇంజనీరు,
పి. డబ్ల్యు. డి. ఆర్ అండ్ బి
మహబూబునగరము.

రామతీర్థ

బ్రహ్మీ స్పెషల్ నెం॥ 1. తైలము

బట్టతల లలో వెంట్రుకలు మొలిపించును. జ్ఞాపకశక్తివృద్ధిచేయును. దృష్టికి సుఖనిద్రకు హామీ ఇచ్చును. నెరసిన వెంట్రుకలను నల్ల చేయును. వెంట్రుకలూడకుండ ఆపును అందరికి అన్నిఋతువులందు వుపయోగపడును.

వివిధ ఆసనాలుగల పటము మనియార్డరుద్వారా 1-8-0 పంపిన పంపబడును. రు. 3-8-0 పెద్దసీసా రు. 2-0-0 చిన్నసీసా (అన్నిచోట్ల దొరుకును.)

రామతీర్థ యోగాశ్రమము, దాదర్ (సెంట్రల్ రైల్వే)
స్టేషన్ బాంబె నెం. 14.

గ్రామ వార్తలు

శ్రీ కృష్ణగ్రంథాలయము

మానుకోట, జూన్ 24

ప్రాగ్రెసివ్ గ్రూప్ ప్రతినిధియిలా తెలుపుచున్నారు.

శ్రీకృష్ణాంధ్రగ్రంథాలయమునకు శ్రీ కండ్ర నారాయణరావుగారు 15 సంవత్సరములక్రితము భవనము మరియు కొంత ఖాళీస్థలమును (భవనను నానుకొని) దానపూర్వకముగా యిచ్చిరి. అట్టి దానపత్రమును లిఖితపూర్వకముగా యిచ్చుటయేగాక గోలకొండ పత్రికలోకూడా ఆనార్తను ప్రకటించుట జరిగినది. పోలీసుదర్యాలో గ్రంథాలయ గ్రంథములతోపాటు యిట్టి కాగితములు శిథిలములైనందు వలన తిరిగి గ్రంథాలయ భవనమును వశపరచుకొనుటకు ప్రయత్నము నలుపుచున్నాడని తెలియుచున్నది. శ్రీగండ్రి నారాయణరావుగారు మరియు శ్రీ కేశవరెడ్డిగారు గ్రంథాలయమునకుయిచ్చిన స్థలమును వశపరచుకొను ప్రయత్నమునుండి విరమించుకొని ప్రజాహితమునై కృషి నల్పుటతగును.

సారస్వత పరిషత్తు పరీక్షలు

రామన్నపేట, జూన్ 24

ఆంధ్ర సారస్వత పరిషత్తు పరీక్షా కేంద్రము పక్షమున 19 నుండి 21 సాయంత్రమువరకు ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలావరణలో శ్రీ బద్రి నారాయణగారి ఆధ్వర్యమున ప్రాథమిక-మాధ్యమిక, ప్రవేశపరీక్షలు జయప్రదంగా జరిగినవి. అభ్యర్థులెల్లరు హాజరై భాషాభిమానమును ఋజువుచేసి తమ ఉత్సాహమును వెల్లడించిరి.

కర్నూలులో వనమహోత్సవం

కర్నూలు, జూన్ 24

కర్నూలులో జరగబోయే వనమహోత్సవం సందర్భంలో ఖర్చులకుగాను యిదివరకు కేటాయించిన రూ. 1,000 లకు అదనంగా మరి రూ. 500 లను ప్రభుత్వం మంజూరు చేసింది.

రామగుండం థర్మల్ స్కీము వర్కర్ల తీర్మానం

రామగుండం, జూన్ 24

రామగుండం థర్మల్ పవర్ స్కీమ్ వర్కర్ల యూనియన్ సమావేశం 21న జరిగింది. 7 రోజుల ముందుగా తెలియపర్చిన తరువాత, అధికారులకు, వర్కర్లయూనియన్ మధ్యన ఒప్పందమైన అంశాలు తీర్చబడకపోతే, సరాసరి తగిన చర్యతీసుకోవాలని ఏకగ్రీవంగా ఈ సమావేశంలో తీర్మానించబడింది.

(ఎ. ఎన్. ఎస్.)

మానుకోట తాలూకా కాంగ్రెస్ అధ్యక్షపదవి

మానుకోట, జూన్ 24

వరంగల్ జిల్లా కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ నూకల రామచంద్రారెడ్డి గారు ఎన్నికయినతర్వాత మానుకోట తాలూకా కాంగ్రెసు అధ్యక్షులుగా కొత్తవారిని ఎన్నుకొనవలసియున్నది. శ్రీయుతులు గండేపల్లి సత్యనారాయణరావు, డాక్టర్ గోపాలరావు మరి కొందరు ఈస్థానమునకు పోటీచేయగలరని తెలియుచున్నది.

మానవునిమ్రింగినచేప

మానుకోట, జూన్ 22

16-6-54న యిక్కడ ఒకలంబాడీ బాలుడు చావలుపట్టుటకు చెరువుకు వెళ్ళి చావలుపట్టినాడు. పాములాగ కొద్దిగా పొడవుగాయుండె ఒకరకం. ముక్కు-పొవర వానికి మామూలుచాపలతోపాటు లభించినది. దానిని కొరికి చంపి బుట్టలోనేద్దాము అనే వుద్దేశ్యముతో దానినివట్టుకొని కొరకుటకు నోటిలోపెట్టుకోగానే అకస్మాత్తుగా గొంతులోకి వెళ్ళినది. తిరిగి బయటకు రానందున స్థానికప్రభుత్వవైద్యశాలకు వెళ్ళగా బయటికితీయుటకు తగినసాధనములు తమవద్దలేవని వరంగల్ జిల్లా ఆస్పటాల్‌కు వెళ్ళుమనినలహాయిచ్చారు. వరంగల్‌కువెళ్ళగా వారుప్రయత్నించి విఫలులై హయ్‌దరాబాదుకు వెళ్ళుమని చెప్పగా అక్కడినుండిహయ్‌దరాబాదు వెళ్ళి వుద్దేశ్యముతో వరంగల్ స్టేషన్ వరకు చేరుకోగానే ఊపిరిఆడక ఆబాలుడు మరణించెను.

ప్రాథమిక మాధ్యమిక తదితర పరీక్షలు

నాగరకర్నూలు, జూన్ 24

జూన్ 19, 20, 21, 22 తేదులలో జరుపబడిన పరిషత్తు ప్రాథమిక, మాధ్యమిక, ప్రవేశ, విశారద పరీక్షలు నాగరకర్నూలు కేంద్రములో వి.ఆర్ కృష్ణకాగారు మరియు, పండిత ఎం.వి. వీరభద్రయ్యగారి పర్యవేక్షణములో జయప్రదముగా జరిగినవి. పరిషత్తువారు విశారద పరీక్షా కేంద్రము నాగరకర్నూలులో జరుగునట్లు అనుమతించి యీ ప్రాంతము విద్యార్థులకు సౌకర్యము కలిగించుట ముదావహము.

క్యారంప్రియుల సమావేశం

సికింద్రాబాద్, జూన్ 24

క్యారంఆటగాండ్ర కేంద్ర అసోసియేషన్ ఒకటి ఏర్పాటుచేయబడగలదు. ఈ విషయ చర్చలనిమిత్తము ఒకసమావేశం జూన్ 27 న సాయంత్రం 6 గంటలకు, 3119, కింగ్స్‌వే మేడమీద జరుగగలదు. మేజర్ ఎస్. కె. గురుస్వామి అధ్యక్షోపన్యాసాన్నిస్తారు.

(ఎ. ఎన్. ఎస్)

ఆరోగ్యశాఖామంత్రి నిలోఫరు ఆసుపత్రి సందర్శన

హయ్‌దరాబాద్, జూన్ 24

నవాబ్ మెహిదీ నవాజ్‌జంగ్ (హెల్తు, రూరల్ రికన్‌స్ట్రక్షన్‌శాఖల మంత్రి) గారు అనుకోకుండా సోమవారంనాడు నిలోఫర్ ఆస్పత్రిని దర్శించారు. ఆయన ఆస్పత్రినంతా తిరిగి చూచారు. ఈయన ఇక్కడి పరిశుభ్రతకు తృప్తిని వెల్లడించారు. వీరు కొన్ని పిల్లల మంచాలను పరీక్షించి అవి కొంచెము విరిగివుండుటవల్లఅసంతృప్తిని వెల్లడించారు, పిల్లలు మంచంపైనుండి క్రిందికిపడే అవకాశం గలదనిన్ని అందులకల తగుజాగ్రతవెంటనే తీసుకోవాలని ఆసుపత్రి అధికారులను హెచ్చరించారు.

భోజన పరికరాలను, చార్టులు మొదలగువాటిని జాగ్రత్తతో పరిశీలించారు కూడా.

(ఎ.ఎన్.ఎస్)

సరఫరా మంత్రి పర్యటన

మునీరాబాదు కమ్యూనిటీ ప్రాజెక్టు ప్రాంతాలలో

మునీరాబాద్, జూన్ 24

సరఫరా, వ్యవసాయం, ప్లానింగు శాఖలమంత్రి డా॥ యం. చెన్నారెడ్డి గారు 1954 వ సంవత్సరం జూన్ 21 వ తేదీనాడు నిర్విరామంగా గడిపారు. మునీరాబాదునుండి ఉదయం 8 గంటలకు బయలుదేరి భాగ్యనగరం, కుక్కునూరు, తంపూరు, సంగన్‌హాల్, ఎల్బర్గ చిక్నయగిర్, కుద్రమూతి, గణపాల్ మొదలయిన గ్రామాలనుదర్శిస్తూ అనేక కచ్చారోడ్లమీదుగా, వంతెనలు లేని కాలువలమీదుగా, గ్రామాల బండ్లదారుల మీదుగా రాత్రి 12 గంటలవరకు కష్టగీచేరుకొన్నారు. ఏ మంత్రికూడా ఇదివరకు వెళ్ళియుండని పల్లె-పట్టుల లోకి డా॥ చెన్నారెడ్డిగారు వెళ్ళివచ్చినారు. మంత్రిగారిరాకవలన గ్రామీణులు ఆనందోత్సాహాలతో శ్రీవారిని ఆహ్వానించడానికి పచ్చతోరణాలు, రంగు-రంగుల కాగితాలతో కమాన్లు మొదలగువాటిద్వారా పురవీధులనలంకరించినారు. డప్పులతో, కొమ్ములతో ఎన్నో ఎడ్లజతల బండ్లతో బ్రహ్మాండమయిన ఊరేగింపులు తీసి, మంత్రిగారి పట్ల తమ భక్తివిశ్వాసాలను ప్రకటించారు. భాగ్యనగరమునే గ్రామములో చేనేతకార్మికులు కట్టుకొన్నగృహాలను సందర్శించి నగంలో నిర్మాణం ఆగిపోయిన ఇండ్లనిర్మాణం పూర్తిచేయడానికి యజమానులకు ప్రభుత్వం తరఫున ఋణాలిప్పించే ఏర్పాట్లు చేయగలనని మంత్రిగారు వాగ్దానంచేసినారు. కుకునూరు, సంగనహాల్ చిక్నియాగిర్, కుద్రిమోతి, గణపాల్ గ్రామాలలో వ్యావసాయిక గోదాములు తెరువబడగలవని అక్కడ అన్నిసమయాలలోనూ వ్యావసాయిక అవసరపరికర సామగ్రి ప్రభుత్వపు రేట్ల చొప్పున లభించగలవని కూడా మంత్రిగారన్నారు. ట్రాక్టర్లు తక్కావీ అప్పులు (బావులుత్రవ్వడానికి) ఆయిల్ ఇంజన్లు, ఫర్టిలైజర్లు, బిల్డింగు ఆపరేషనులకు అవసరమయ్యే పనిముట్లు, పదార్థాలు, సరఫరాచేయబడగలవని కూడా శ్రీవారన్నారు. యిటికాళ కొన్నిచోట్ల హరిజనులకు బావులు త్రవ్వించబడగలవనీ, ఎల్బర్గ, కుద్రిమూతిలో చెరువులుమరమ్మత్ చేయబడగలవనీ స్థానికప్రజలకు మంత్రిగారు వాగ్దానం చేసినారు.

పశువుల పెంపకం

మునిసిపల్ కమిషనర్ అనుమతి

హయ్‌దరాబాద్, జూన్ 24

1950 సంవత్సరపుహయ్‌దరాబాదు మునిసిపల్ కార్పొరేషను చట్టము 13 వ ఆశ్వాసం, 22 (1) నిబంధన ననుసరించి కమీషనర్ లిఖిత అనుమతి లేనిదే నగరపరిహద్దులలో ఏభాగంలో నయినా బాతులు, కుక్కలు, పశువులు (ఎద్దులు, ఆవులు మొదలగునవి) గొర్రెలు, మేకలు, కంచర గాడిదలు ఇంకా ఇటువంటి చతుష్పాద జంతువులను పెంచరాదు.

ఈప్రకటన ప్రచురింపబడిన నాటి నుండి 30 రోజులలోపుగా మునిసిపల్ కమీషనరు అనుమతి పొందవలసిందిగా ప్రజలు కోరబడుతున్నారు.

ఎవరైనా ఏ కారణంవల్లనైతేనేమి కమీషనరు అనుమతి పొందనట్లయితే పై నుదాహరించిన చట్టంక్రింద తీసుకొనబడే చర్యకు బాధ్యులు కావలసి ఉంటుంది.

చేనేతవారిపైనున్న సుంకాలు రద్దు గావించాలి

హయ్‌దరాబాద్, జూన్ 24

శ్రీయుతులు బద్దంయల్లారెడ్డి ఎం. పి. డాక్టర్ రాజాబహద్దూర్ గౌడ్ ఎం.పి. రామానందం ఎమ్. ఎల్. ఎ., బి.డి. దేశ్‌పాండే అసెంబ్లీలో (ప్రతిపక్షనాయకుడు), విఠల్‌రావ్ పవర్, ఎ. నరసింగ్, మాణిక్ రావు చిల్‌చేరి, పిడ్డుల బాలరాజయ్యగారు ఒక స్టేట్‌మెంట్ దాఖలుజేశారు. అందులో చేనేత పారిశ్రామికుల కష్టాలనుగుర్తించాలనియు, వారిపై వృత్తిపన్ను, ఆదాయపన్నులు విధించుట నిలుపుచేయాలనియు, మునిసిపాలిటీలను, స్థానికసంస్థలను కోరనైనది.

వివిధ మునిసిపాలిటీ హైస్కూళ్లకు ఆయాప్రాంతపు చేనేత పనివారుఅసంఖ్యాకంగా ఈపన్నులనిషేధిస్తూఅర్జీలు దాఖలుచేసుకోవాలని కూడా ఏయ చేనేత పారిశ్రామికులకు బోధించారు.

ఎరువుల పంపిణీ

ప్రైవేటు ఏజన్సీల ద్వారా

హయ్‌దరాబాదు, జూన్ 24

మే 17, 1954 నాడు జారీచేయబడిన పత్రికా ప్రకటన ద్వారా సహకార సంఘాలు, ప్రైవేటు ఏజన్సీలనుండి నగదురొక్కంపైన కర్షకులకు ప్రభుత్వముచేత అనుమతించబడిన ధరలకు ఎరువులమ్మడానికిగాను దరఖాస్తులు కోరబడియున్నవి.

ఎరువుమిశ్రణం అమ్మకపు బాధ్యతను స్వీకరించడానికి సంసిద్ధంగాఉన్న సహకారసంఘాలు లేక ప్రైవేటు ఏజన్సీలు హయ్‌దరాబాదు వ్యవసాయశాఖ డైరెక్టరుకు పూచీపత్రాలువ్రాసియిచ్చి పర్మిట్లుతీసుకొనవచ్చును. ఎరువు మిశ్రమం. ఆమోదితులైన పంపిణీదారులకు 64 పౌన్లుగల ప్రతి సంచికి రు. 10-2-3 లకు అమ్మవచ్చును కొనుగోలు ధరకు అమ్మకపు ధరకుమధ్యగల భేదం పంపిణీదారులకు కమీషనుగా గిట్టుబాటుఅవుతుంది. సాధ్యమయినంత మేరకు అమ్మకపు ధరను తగ్గించడం పంపిణీదారుల ఇష్టముమీదఆధారపడి వుంటుంది. మిగతావివరాలు హయ్‌దరాబాదు వ్యవసాయశాఖ డైరెక్టరు వద్ద తెలుసుకొనవచ్చును.

ఆంధ్ర అసెంబ్లీ ఉపఎన్నిక

దుగ్గిరాలలో కాంగ్రెసు అభ్యర్థి విజయం

కర్నూలు, జూన్ 22

గుంటూరు జిల్లా దుగ్గిరాల నియోజకవర్గం నుండి ఆంధ్ర శాసనసభకు జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెసు అభ్యర్థి శ్రీ మిడూరి నాగేశ్వరరావుగారు గెలుపొందారు.

శ్రీనాగేశ్వర రావుగారికి 21,926 ఓట్లు రాగా కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ ఎల్. బాలగంగాధరరావుకు 20,644 ఓట్లు, కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థి శ్రీ ఎ. వెంకటేశ్వర్లుకు 5725 ఓట్లు వచ్చినవి. లోక్ పార్టీ అభ్యర్థి ధరావతును కోల్పోయాడు.

కాంగ్రెసు సభ్యుడు అప్పుకురామిరెడ్డిగారి మరణం ఈ ఉపఎన్నికకు కారణమైనది.

పి.ఎస్.పి. కార్యవర్గ సమావేశం

తీర్మానాలు లేకనే వాయిదా

హైదరాబాద్, జూన్ 23

హైదరాబాద్ రాష్ట్ర ప్రజాసోషలిస్టుపార్టీ కార్యవర్గ అధ్యక్షుడు శ్రీ సి. మాధవరెడి ఎం. పి. అధ్యక్షతలో రెండురోజులపాటు సమావేశం జరిపి ఏ నిర్ణయమూ కైకొనకుండా వాయిదావేసింది.

నిరుద్యోగం, రాష్ట్రాల పునర్నిర్మాణం ఉభయనగరాలలో రానున్న మునిసిపల్ ఎన్నికలు అనే మూడు ప్రశ్నలపై కార్యవర్గం చర్చలు జరిపింది.

రాష్ట్రాల పునర్నిర్మాణం విషయమై విశాలాంధ్ర మా, రెండు తెలుగు రాష్ట్రాలా అనేవిషయంలో పార్టీ సభ్యులలో విభేదాలున్నాయి. రాష్ట్ర విచ్ఛిత్తి అనంతరం తెలంగాణ భవిష్యత్తు సమస్యను నిర్ణయించడానికి ప్రతినిధుల సమావేశాన్ని ఈ సమావేశం ఏర్పాటు చేయడానికి కార్యవర్గం నిర్ణయించవలసి ఉంది. క్యాడరు విభేదాల కారణంగా అలా చేయలేదు.

శ్రీ కళావెంకటరావు

నాగ్‌పూర్, జూన్ 23

కాంగ్రెసు మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ కళావెంకటరావుగారికి నేటి ఉదయం మేయోఆసుపత్రిలో సివిల్ సర్జన్ డా॥ రంగిలాల్ ఆపరేషన్ చేశారు. త్వరలో ఆయన కోలుకొంటారని డాక్టర్ అన్నారు. (యు.పి.ఐ.)

నేటిరాత్రి నేటిరాత్రి

4 వ సంయుక్త వారము

మీ యొక్క విచారములను పోగొట్టునటువంటి పాటలు, నృత్యములు గలిగిన అద్భుత చిత్రము.

ప్రకాశ్ పిక్చర్స్ వారి కానుక.

"బాలానందం"

(తెలుగు)

వెలుగు నిచ్చునటువంటి 3 అద్భుత కథలు.

బూరెల మూకుడు కొంటె కిష్టయ్య

రాజయోగం.

బడికి పొయ్యే పిల్లలచే నటించబడినది.

మీ కుటుంబములో ప్రతి వ్యక్తి చూడవలసిన చిత్రం.

సాగర్ హైద్రాబాద్

చిత్ర సికింద్రాబాద్

నేడు ఆటలు: 2-45, 6-0, 9-30 గం॥

చక్రియా రిలీజ్.

9 వ సంయుక వారం

బసంత్ పిక్చర్స్ వారి

అలిబాబ మరియు నలుబది దొంగలు

స్టేట్ టాకీస్ దిల్షాద్ టాకీస్

నయాపూల్. హయ్‌దరాబాదు.

నేటిరాత్రి నేటిరాత్రి

'మనోహర'

7 వ వారము 4 వ వారము

రాయల్ ప్యారడైస్

హైద్రాబాదు సికింద్రాబాదు.

(హిందీ) (తెలుగు)

సహజమైన పోషణకు ఎన్నిక అయినది

JB. జె. బి.

గ్లూకోస బిస్కట్లు

సంపూర్ణమైన విందుభోజనం, సూర్యరశ్మికలు, ఆరోగ్యవంతులకు మైన గ్లూకోస బిస్కట్లు.



పుష్ట నిచ్చునట్లు ఆధారమైనది.

జె. బి. మంగారామ్ అండ్ కం. లిమిటెడ్, హైద్రాబాద్ (కె)

లోకల్ ఏజంట్లు:-

కె. మోతిరాం అండ్ కం.

స్టేషన్‌రోడ్, సికింద్రాబాద్ : : బేగంబజార్, హైద్రాబాద్

నేటి రాత్రి నేటి రాత్రి

జయంత్ దేశాయ్ వారి

"మిస్. మాల"

తారలు: వైజయంతిమాల, కిషోర్ కుమార్, దీపక్, బిపిన్‌గుప్త, ఆగ, మరియు శ్యామ్‌సన్ మొ॥

ప్రభాత్- హైద్రాబాద్ మినర్వా- సికింద్రాబాద్.

ఫిలిమ్ షో రిలీజ్.

నేడే 3-30 గం॥ గొప్ప విడుదల.

పాటలు, నృత్యములు, నవ్వులు గల గొప్ప చిత్రం.

'సింగారి'

తారలు. లలిత, పద్మిని, టి. ఆర్. రామచంద్ర.

సాగర్ హయ్‌దరాబాదు

వాణిజ్యవ్యాపారాలు

గుబ్బాబుచ్చయ్యగారి
వెంకటేశం కమీషన్ ఏజంటు
(కర్దారు రేట్లు)

హైదరాబాద్ 24-6-1954

120 శేర్ల పల్లాఒక్కంటికి

పసుపు	130-0-0 158-0-0
పెసళ్ళు	23-0-0 25-0-0
పొడ్డు నియ్యం	44-0-0 44-9-0
గొట్టెల నియ్యం	42-0-0
నెంబర్లు	45-8-0 49-0-0
నూకలు	28-0-0 36-0-0
సాంబర్లు	53-0-0 58-0-0
గోధుమలు	49-0-0 55-8-0
కందులు పెద్దవి	23-0-0 24-3-0
కందులు చిన్నవి	20-0-0 20-4-0
మినుములు	32-0-0 35-0-0
లంకలు	24-0-0 25-12-0
సెనగలు	30-8-0 31-0-0
ఉలవలు	20-8-0 22-0-0
బెల్లం	48-12-0 49-8-0
తెల్లజొన్నలు	31-0-0 35-8-0
మిరుపకాయలు	270-0-0 315-0-0
ఉల్లిగడ్డ	16-0-0 17-4-0
చింతపండు	100-0-0 145-0-0
పసుపులు	29-0-0 32-0-0
తెల్లనువ్వులు	80-0-0 100-0-0
ఇలాతిపలుకుచున్నది	48-0-0

(నంచి 1 కి)

ఆముదాలు	38-8-0 39-6-0
పెద్ద కందిపప్పు	33-0-0 34-0-0
చిన్న కందిపప్పు	28-8-0 30-0-0
సెనగపప్పు	38-0-0 39-0-0
పెసరపప్పు	35-0-0 36-0-0
మినుపపప్పు	52-0-0 53-0-0
లంకపిండి	34-0-0 36-0-0

16 శేర్ల మణుము

ధనియాలు	7-0-0 8-0-0
సోము	4-8-0 4-12-0

40 శేర్ల మణుము

నెయ్యి	120-0-0 130-0-0

ఈ ప్రకారము ఈరోజు అయిన లావాదేవీలు నాకు తెలిసినవి వ్రాయబడినవి. గిట్టినవర్కులు ఎలుపవచ్చును. తెప్పించుకోవచ్చును.

బొంబాయి మార్కెటు

బొంబాయి జూన్ 24

అంగారంతులు 1 కి	84-4-0
కాండి తులు 100 కి	150-13-0
నవరసు	57-4-0

న్యూయార్కు ప్రత్తి

న్యూయార్కు, జూన్ 24

ప్రారంభం	33-86
ముగింపు	33-79

కావలెను.

ఈ క్రింద సూచించిన తాలుకా స్థలాలలో మా పత్రికను విక్రయించుటకు నమ్మకమైన ఏజంట్లు కావలెను. వలయువారు మా ఏజన్సీ నియమాలు తెప్పించుకొనుడు. డిపాజిటు పెట్టువారు మాత్రమే దరఖాస్తు పెట్టుకొనవలెను.

హుజూరాబాదు	అందోలు
మేడ్చెల్	కోడంగల్
ఇబ్రాహింపటం	జహీరాబాదు
ఆత్మకూరు	నారాయణఖేడ్
మక్తల్	మోమినాబాదు
పర్గి	ఆదిలాబాదు
కల్వకుర్తి	నిర్మల్
అచ్చంపేట	రాజారా
నాగర్‌కర్నూలు	నిర్మూరు
కొల్లాపురం	శేన్నూరు
కొప్పల్	లక్షట్టిపేట
అలంపురం	ఆసిఫాబాదు
యల్లారెడ్డి	హుజూరాబాదు
బాన్సువాడ	జమ్మికుంట
బోధన్	పర్కాల
ఆర్మూరు	మొలుగు
అందోలు	పాఖాల
మెదక్	మధిర
సిద్దిపేట	ఇల్లెందు
సిరిసిల్ల	కొత్తగూడెం
సుల్తానాబాదు	మిర్యాలగూడెం
పెద్దపల్లి	హుజూరనగరం
మంథెన	

మేనేజరు,
గోలకొండ పత్రిక.

ప్రజాస్వామ్యంలో విద్య

శ్రీ యస్. బి.పి. పట్టాభిరామారావు గారి వివరణ

కర్నూలు, జూన్ 24

మానవుని జీవ యాత్రకు విద్య సాధనం. ఇతర జీవరాశికి లేనట్టి స్వాతంత్ర్యాన్ని, జీవితగతిని తాను నిర్దేశించుకొనే బుద్ధిని, స్వాతంత్ర్యాదు సిద్ధింపజేయడానికి విద్య తోడన్నిలుంది'' అని ఆంధ్రప్రభుత్వ విద్యామంత్రి శ్రీ బులుసు ప్రభాకర పట్టాభిరామారావుగారు రేడియో సంగంలో పేర్కొన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు:

"కాబట్టి అయిదేళ్ళు రాగానే అక్షరాభ్యాసం చేయటమే మహాభాగ్యముగా యెంచుకుంటారు. చదువుకొన్నచో మరేమీ లేకపోయినా చేతులెత్తి నమస్కరిస్తాం. చదువుకొనని చోట మరేమిటో నాశాణింపుకురాదు.

అయితే ఇంతవరకూ మానవనంక్షోభ మంతమొంద లేదంటే మన పాత విద్యావిధానాలు విఫలమైనట్టే గ్రహించాలి. విద్యావిధానాలు కేవలం పాండిత్యానికి, ప్రత్యేక నైపుణ్యానికి, జీవికకు మాత్రమే ఉపయోగపడుతున్నవి. జీవితములోని అగాధ సత్యాలను తెలుసుకొనేట్లు మనిషికితోడ్పడుటలేదు. కాబట్టే పాండిత్యమూ, ప్రత్యేక నైపుణ్యం, జీవికవృత్తులు ఇంకెక్కువ ఘర్షణలను, పోటీలను, దైన్యాన్ని, కారత్యాలను తెచ్చిపెట్టు తున్నాయి. కాబట్టే ప్రపంచమంతటకూడా బుద్ధిమంతులు విద్యా విధానాలను గురించి మళ్ళీ-మళ్ళీ అలోచిస్తున్నారు. తర్కిస్తున్నారు. పరిశీలనలు జరుపుతున్నారు అందరిదృష్టి ఇలా విద్యారంగముపై మొగ్గటం శుభసూచకం. స్వతంత్ర, అస్వతంత్ర దేశాలలోనూ, ధనిక-నిర్ధనిక దేశాలలోనూ విద్యనుగురించిన పునరాలోచన విస్తారంగాఉంది. ఎందుకంటే మానవునికి యెప్పటికైనా విముక్తి ఒక మార్గంవలన సిద్ధించగలదు. అదితన్ను యితరులను అర్థంచేసుకొనడం. అర్థం చేసుకొనటానికి విద్యే సహాయం.

మనకు స్వరాజ్యంవచ్చాక మనపెద్దలు కూడా విద్యారంగంలో సరైన మార్పులు తేవడానికి తీవ్రకృషిచేస్తున్నారు. విశ్వవిద్యాలయంనుంచి ప్రాథమిక పాఠశాలలవరకు విద్యగమనాన్ని నవ్యంగా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. దేవ్వడి యింకా తొమ్మిది నెలలు కాకపోయినా ఆంధ్రప్రభుత్వం విద్యకున్న ప్రాముఖ్యమును గుర్తించి తగిన మార్పులుతీసుకరావటానికిప్రయత్నిస్తోంది- తీవ్రంగా.

ప్రస్తుతం అమలులోనున్న ప్రాథమిక విద్యావిధానం చాలాఅసంతృప్తికరంగా ఉన్నది. మన బాల బాలికలలోచాలామందికి చదువు లభించటం లేదు. 1951 లెక్కలప్రకారం 6-12 ఏళ్ళమధ్యనున్న వారిలో నూటికి 41 మందిమాత్రమే బడికి వెళ్ళటానికి వీలైనది. ఈ రెండేళ్ళలో కొంతఅభివృద్ధి వుండిఉంటుంది. ఏమైనా చదువుకు ఈడువచ్చిన వారిలో సగంమందికైనా విద్యా విహీనులుగానే ఉండిపోవలసి వస్తోంది. ఒక విధంగాచూస్తే ప్రతి కుటుంబంలో సగంమందికే విద్యనెలుతురు సోకుతోంది. మిగతా సగంమందికి చీకటి. ప్రస్తుతం ప్రాథమికవిద్యపై ప్రభుత్వంమొత్తం సుమారు 2 కోట్ల, 43 లక్షలరూపాయలకు కొంచెము మించి ఖర్చుపెట్టుతోంది. మొత్తము విద్యపైఖర్చులో ప్రాథమికవిద్యకంతు సూటికి 56 పాళ్ళపైనఉన్నదిః ఈ పద్ధతినఈడువచ్చినఅందరికీ చదువు చేకూర్చాలంటే ప్రాథమిక విద్యకే సుమారు 6 కోట్లరూపాయలు కావాలి. పదేళ్ళలో ప్రాథమికవిద్యను ఉచితంగా, నిర్బంధంగా అమలుజరుపాలని మనరాజ్యాంగం ఆదేశిస్తోంది.

పిల్లవాడు చిన్నవాడుగాఉంటాడు పాఠశాలకూడా చిన్నదిగా నిరాడంబరంగా ఉంటుంది. కాని పిల్లవానిజీవిత సార్థకత యావత్తూ అప్పటివిద్యపైనే చాలావరకు ఆధారపడిఉంటుంది అని అంటే ఆశ్చర్యపడనక్కరలేదు. జీవితంలో తొలిసారిపరిచయం కలిగే ఆ సమయం చాలాముఖ్యం. అప్పుడుఏర్పడే దృష్టియే పిల్లవానికి యావజ్జీవితం కళ్ళకు కాటుకగా ఉండిపోతుంది. పిల్లవాడి దృష్ట్యానేకాదు, సమాజము దృష్ట్యాకూడా ఈ ప్రాథమికస్థాయి చాలా ముఖ్యం. ఎందుకంటే వ్యక్తులకు జీవితంపట్లనున్న దృక్పథమేసమాజస్వరూపాన్ని నిర్దేశిస్తుంది గనుక.

మన ప్రాథమిక విద్యావిధానంలో ఉన్న లోపాలనువరించి నవ్యమయిన నూతన విధానాన్నిరచించాలని ఆంధ్ర ప్రభుత్వం ఒకప్రాథమికవిద్యాసంఘాన్ని నియమించింది. వీరి సిఫార్సులలో ముఖ్యమయిన దేమిటంటే ప్రాథమిక విద్య సమగ్రంగా ఉండాలనడం. 'బోధన'-'కృషి' ఈ రెండూ మొదటి నాలుగు తరగతులలోకూడా ఉండాలి అయిదవ తరగతిలో ఈరెంటి సమగ్ర శిక్షణ అయిదుగంటలు అలవరచాలి. అర్థికంగా చిక్కులున్నవి కాబట్టి ఈ సూచనలను పరిశీలించి అమలుజరపడానికి కొంచెం వ్యవధి అవసరము అవుతుంది. యిది జరిగేవరకు పూర్వము నవరింపబడిన స్కీము నిలుపుదలచేయబడినది. దీన్నిగురించినవాదవివాదాలు ఇందువలన సమసిపోగలవు. కొత్త విధానం అమలులోకివచ్చేదాకా, నవరింపబడిన స్కీముకు పూర్వముఉన్న విధానమే ఆచరణలోఉంటుంది. భవిష్యత్తుకంతో సంబంధించియున్న విషయము కాబట్టి కొత్తస్కీము గురించి నిజానంగా నిష్పాక్షికంగా ఆలోచించడానికి ఇందువలన అవకాశము చిక్కుతుంది. నరైన విద్యకు పార్టీ రాజకీయాల ప్రమేయం విమాత్రమూ పనికిరాదు. ఆరే-డేళ్ళ పిల్లలను మన సంకుచిత తత్వాలకు, అహంకారాలకు స్వార్థాలకు గురిచేయటంకన్నద్రోహము మరొకటి లేదు. అంతకన్నఘోరం మరొకటుంది- అదిపిల్లలను మనసిద్ధాంతాలకు కర్మాగారాల్లో మరనీలలుగా తయారుచేయటం.

ఆంధ్రప్రభుత్వం విద్యావ్యాప్తికేగాను రాష్ట్ర ప్రభుత్వాలకు 20 కోట్ల రూపాయలను సహాయం చేస్తోంది. ఆంధ్రప్రభుత్వం ఈవిధమైన కేంద్ర సహాయంతో కొన్ని స్కీములను అమలు జరపాలని ప్రయత్నిస్తోంది.

సాంఘిక వయోజన విద్య స్కీముకింద, కార్యకర్తల శిక్షణకు, సామాజిక విద్యాశాఖప్రారంభానికి,నిర్వహణకు, వయోజన విద్యా సంచారకదళాలకు, కేంద్ర ప్రభుత్వంనుంచి 2 లక్షల 24 వేల రూపాయల సహాయం లభించవచ్చు. గ్రంథాలయాలకు, ఇత్యాదు గుక్షసంబంధించిన మరికొన్ని స్కీములరించి కూడా కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని కోరుతున్నాం.

కేంద్ర ప్రభుత్వ సహాయం 3 ఏళ్ళకుగా నర్దుబాటు చేయబడుతుంది. మొదటి సంవత్సరం 100కి 75పాళ్ళు, రెండవ సంవత్సరం 50 పాళ్ళు, మూడవసంవత్సరం 25 పాళ్ళు ఉంటుంది. నాల్గవ ఏటనుంచి రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించుకొనాలి. అయితే కేవలము కేంద్ర ప్రభుత్వం సహాయంతో నే పనులు జరగవు. రాష్ట్ర ప్రభుత్వము కూడాఖర్చు చేయకతప్పదు.

ఒక విషయం ఈ నెలారంభంనుంచి చాలామందిని కలత పెట్టుతోంది. గత సంవత్సరాల్లో జిల్లా బోర్డులు చాలా సెకండరీ స్కూళ్ళను ప్రారంభించినాయి. స్థానిక ప్రజల్లో అమితమైన ఉత్సాహము, మిన్నుముట్టింది. చందాలు, విరాళాలు వాగ్దానాలుచేసిప్రజలఉత్సాహాన్ని తెలిబుచ్చారు. కానిక్రమేపీ ఈ ఉత్సాహం ఉడిగింది. అసలే ఆర్థికంగా కృశిస్తున్న జిల్లా బోర్డుల భుజాలపై ఈస్కూళ్ళ భార మంపడింది. పౌరుల వాగ్దానాలు చాలా సందర్భాలలో క్రియా రూపం ధరించ లేదు.ఈ సందర్భంలో అట్టి స్కూళ్ళను మూయవలసివస్తుందని తెలియజేయగా, మళ్ళీ విరాళాలు కొంత వరకూ సమకూరుతున్నవి. తత్ఫలితంగా, ఈ ఏడాది ఏ స్కూలునూ మూయటానికి వీలు లేదని తీర్మానించాం. 1955 ఏప్రిల్ లోపుకు తగినంతగా విరాళాలు రాకపోతేనూ, జిల్లాబోర్డుల ఆర్థికస్థితి తగినంతగా లేకపోతేనూ, ఈ స్కూళ్ళను మూసివేయక తప్పదు.

సెకండరీ విద్యావిధానం యావత్తు పరిశీలనకిందఉన్నది. కేంద్రప్రభుత్వం నియమించిన సెకండరీ విద్యాసంఘము ఇటీవలనే నివేదికనర్పించినది. సిఫార్సుల గురించి ఆలోచనలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో కొంత కాలంపట్టుతుంది-నిర్ణయాలకు రావటానికి. కేవలము డిగ్రీ కోసమే యూనివర్సిటీ విద్య సాగించే ధోరణిని మార్చాలి. సెకండరీ విద్య జీవిక నిర్ణయానికి తోడ్పడాలి.

విద్యారంగంలో ఫీజులకు చాలా ప్రాధాన్యత ఉన్నది.90స్కూళ్ళకు 16 మిలీమీటర్ల ప్రొజెక్టరులున్నవి. 370 స్కూళ్ళకు రేడియోరిసీవర్లుఉన్నాయి. రాష్ట్రంలో కేంద్ర ఫిల్ము గ్రంథాలయానికిగాను ఫిల్ములు, వగైరాలను కొనటానికైప్రభుత్వం రూ. 35000లను మంజూరు చేసింది.

నేషనల్ కేడెట్‌కోర్ దళాలను విస్తరించాలని కూడా ఆలోచిస్తున్నాము. దీని ముఖ్యలక్ష్యాలు మన యువకులకు శారీరక శక్తిని, మానసిక స్థయిర్యాన్ని, సమకూర్చి పెంపొందించటం. క్రమశిక్షణను అలవరచటము. దేశభక్తిని; సంఘీభావాన్ని వృద్ధి పరచటము. కాయకష్టంలోని ఉత్కృష్టతను బోధించటం. సామాజిక సేవను అలవరచటం, ఈ సందర్భంలో సగము ఖర్చును కేంద్ర ప్రభుత్వము భరిస్తున్నది. భవిష్యత్తులో బాధ్యతవహించవలసిన మన యువకులకు ఈ విధమైన శిక్షణ చాలా అవసరం. ప్రయోజకురాలైతమైన శక్తి, బుద్ధి కార్యదక్షతకు దారితీస్తాయి. పాత ఒక వందు లోంచి కొత్త రీతులకు దారి తీయడానికి తోడ్పడుతుంది.

కూడలిస్థలంగా, పుణ్యనీయంగా ఉంటున్న తిరుపతి ఇక ఉజ్జ్వలమైన అనాదినూతన, సనాతన విద్యా కేంద్రంగా కూడాఉండగలదు. తిరుపతిలోస్థాపింపబడేశ్రీ) వెంకటేశ్వరవిశ్వవిద్యాలయం ఆంధ్రజాతిఉత్తమసంస్కృతికిజ్యోతిర్బింబంగా ప్రకాశిస్తుంది.వ్రస్తుతవ్యావిధానాలు ఎంత ఉత్కృష్టమైనవైనప్పటికి, అభిమానశక్తి సంపదలనే సిద్ధింపచేస్తున్నవి. సుఖ, శాంతులను నెలకొల్పలేక పోతున్నవి. ఆలోచనాన్ని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తీర్చి. విద్యకు సార్థకతను చేకూర్చగలిగేట్టు కృషిచేద్దాం.

వ్యక్తి స్వయంగా విఫలుడనబట్టే, సామాజిక తత్త్వానికి ప్రాముఖ్యము వచ్చింది. తత్ఫలితంగాక్రమేపీ ప్రభుత్వ బాధ్యతలు హెచ్చి హెచ్చి, వ్యక్తి పాలిమేరలనుకూడా ఆక్రమించవలసి వస్తోంది. సామాజిక కృషి, ప్రభుత్వ కృషివ్యక్తి సాఫల్యమునకేతోడ్పడాలి. ఇదే ప్రజాస్వామ్య లక్షణం. వ్యక్తి సమాజాన్ని విచ్ఛిన్నంచేసినా. సమాజం వ్యక్తిని కబళించివేసినా, వ్యక్తీ, సమాజమూ ఉభయులూ నశిస్తారు. ఈ ప్రమాదాన్ని అర్థంకొని వ్యక్తికి, సమాజానికి, ప్రభుత్వానికిమధ్యసమన్వయాన్ని సిద్ధింపజేసేదీ ఒక్కటే. అది ప్రజాస్వామ్యం.

కాబట్టే ప్రభుత్వం ఎంత కృషి చేస్తున్నా. ప్రజలుకూడా ఆకృషిలో పాల్గొనాలి. కేవలం పన్నులుచెల్లించి, శాంతిభద్రతలకు అనుగుణంగాఉన్నంతమాత్రాన చాలదు. అది నియంతృత్వ లక్షణం.

చదువు అనేది కేవలం పాఠశాలవల్లనే, కళాశాలలవల్లనేరాదు. నిజమైన అక్షరాభ్యాసం మన పరస్పరసంబంధాల్లోనే ఆరంభించాలి. ఇల్లే, బ్రతుకేనిజమైనబడి,గురుకులం. కాబట్టి పిల్లలను పడికిపంపించేశాం గదాఅని తల్లితండ్రులుచేతులుముడుచుకొని కూర్చొనిప్రయోజనంలేదు.ప్రైవేటు మాస్టరునియోగించటంతో వారిబాధ్యత తీరిపోదు. ఇంటిలో వాతావరణానికి పిల్లవానిపై చాలాప్రభావంఉంటుంది. ఇంటిలో అనుభవించేదానికి, స్కూలులో చదువుకొనేదానికిసామ్యంలేకుండా విభేదంఉంటే, పిల్లవాడికి ఇల్లుగాని, బడిగాని ఐక్యతను సిద్ధింపచేయలేదు. చిన్నతనంనుంచే వాడు అయోమయానికి, మోసానికి, చెప్పటానికి, చేతకు మన్యకున్న అభాతానికి గురవుతాడు. అప్పుడు చదువు, ఇల్లుకూడా వారికి సమగ్రతను చేకూర్చలేవు.

కాబట్టి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు తమజీవితాలలోకి, తమకు ప్రపంచంతో. ఆస్తులతో. అభిప్రాయాలతో, ఇతరజీవులతోనున్న సంబంధాల్లోకి గాఢంగా చూసుకొనాలి తల్లిదండ్రులు జీవితరీతులనుంచి, చదువునుంచి పిల్లవాడు తనజీవితరీతులను ఏర్పరచుకుంటాడు. తల్లితండ్రులు, ఉపాధ్యాయుడు ఎలాఉంటారో, అలాగే ఉంటాడు పిల్లవాడు చాలవరకు. నిజమైన విద్య ఇంట్లోనే అరంభంకావాలి.మనలాగా మనపిల్లలు దారిద్ర్యానికి, అజ్ఞానానికి, అసూయలకు, ఘర్షణలకు దైన్యానికి, దుఃఖానికి చితికి చివికిపోకుండా ఉండాలంటే, మనను ఇంత సంక్షోభకు గురిచేస్తున్న విద్యావిధానాలను, జీవనరీతులను మనపిల్లలపై రుద్దకూడదు. ఇలారుద్ది, తర్వాత మనపిల్లలు ఆకలిజ్వాలల్లో, తిరుగుబాటుల్లో, యుద్ధరంగాల్లో,ఆత్మహత్యల్లోచిక్కుకుపోయారని విలపించి ప్రయోజనం ఏమిటి?

సత్యానికి ద్వారం విద్య. విద్యఅనే ఉద్యమంలో తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వాములు. ప్రభుత్వం చేయాత. మనపిల్లలు కేవలం పెద్దపెద్ద డిగ్రీలు సంపాదించాలదో, మనకు పేరు తెచ్చిపెట్టాలనో గాక, జీవితంలో నిజమైన సుఖశాంతులను సిద్ధింపజేసుకొనేట్టుగా మనమంతా వారికి నరైనవిద్యను సమకూర్చడానికి పాటుపడుదాం''

పి.సి.సి. కార్యవర్గములో ఎన్నికైన సభ్యులు

అధ్యక్షునితోబాటు రాజీనామా ఇవ్వనవసరంలేదని ఎ.ఐ.సి.సి. వివరణ

హైదరాబాద్, జూన్ 24

ప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గానికి యెన్నుకోబడిన 12మంది సభ్యులు1954 డిశంబరులో రానున్న ఎన్నికలవరకు పదవిలత్వాన్ని కొనసాగించనవచ్చునని అనభ భారత కాంగ్రెసు కమిటీ పి.సి.సి. కి సలహాయిచ్చింది. అందువలన పి.సి.సి అధ్యక్షుడు శ్రీ కొండా వెంకట రంగారెడ్డిగారు జైలులోపదవిని విరమించినా వీరు రాజీనామా ఇవ్వనవసరం లేదు.

రంగారెడ్డిగారు మంత్రిగానే ఉండడానికి నిర్ణయించుకొని పి.సి.సి అధ్యక్ష పదవికి రాజీనామాయిచ్చినందున ఈ విషయమై పి.సి.సి., ఎ.ఐ.సి.సి నుండి సలహాను కోరింది.

అయినా పి. సి. సి. అధ్యక్షునితో పాటు నామినేట్ చేయబడిన 8 మంది కార్యవర్గసభ్యులు సభ్యత్వాన్ని విరమించు కొంటారు. నూతనాధ్యక్షుడు తిరిగి నామినేషను ద్వారా ఈస్థానాలను పూరిస్తారు.

ప్రదేశ్ కాంగ్రెసుకమిటీ గత సంవత్సరం తన నియమావళిని సవరించడం ద్వారా కార్యవర్గానికి కొందరిని ఎన్నుకోవడానికి కొందరిని నామినేట్ చేయడానికి పద్ధతిని యేర్పాటుచేయడం పాఠకులకు విదితమే. కాని కార్యవర్గం అధ్యక్షునితోపాటు రాజీనామా చేయాలా లేదా అనే విషయంఅందుపేర్కొనబడనందున ఈసలహా అవసరమయినది.

నికి, ప్రభుత్వానికిమధ్యసమన్వయాన్ని సిద్ధింపజేసేదీ ఒక్కటే. అది ప్రజాస్వామ్యం.

కాబట్టే ప్రభుత్వం ఎంత కృషి చేస్తున్నా. ప్రజలుకూడా ఆకృషిలో పాల్గొనాలి. కేవలం పన్నులుచెల్లించి, శాంతిభద్రతలకు అనుగుణంగాఉన్నంతమాత్రాన చాలదు. అది నియంతృత్వ లక్షణం.

చదువు అనేది కేవలం పాఠశాలవల్లనే, కళాశాలలవల్లనేరాదు. నిజమైన అక్షరాభ్యాసం మన పరస్పరసంబంధాల్లోనే ఆరంభించాలి. ఇల్లే, బ్రతుకేనిజమైనబడి,గురుకులం. కాబట్టి పిల్లలను పడికిపంపించేశాం గదాఅని తల్లితండ్రులుచేతులుముడుచుకొని కూర్చొనిప్రయోజనంలేదు.ప్రైవేటు మాస్టరునియోగించటంతో వారిబాధ్యత తీరిపోదు. ఇంటిలో వాతావరణానికి పిల్లవానిపై చాలాప్రభావంఉంటుంది. ఇంటిలో అనుభవించేదానికి, స్కూలులో చదువుకొనేదానికిసామ్యంలేకుండా విభేదంఉంటే, పిల్లవాడికి ఇల్లుగాని, బడిగాని ఐక్యతను సిద్ధింపచేయలేదు. చిన్నతనంనుంచే వాడు అయోమయానికి, మోసానికి, చెప్పటానికి, చేతకు మన్యకున్న అభాతానికి గురవుతాడు. అప్పుడు చదువు, ఇల్లుకూడా వారికి సమగ్రతను చేకూర్చలేవు.

కాబట్టి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు తమజీవితాలలోకి, తమకు ప్రపంచంతో. ఆస్తులతో. అభిప్రాయాలతో, ఇతరజీవులతోనున్న సంబంధాల్లోకి గాఢంగా చూసుకొనాలి తల్లిదండ్రులు జీవితరీతులనుంచి, చదువునుంచి పిల్లవాడు తనజీవితరీతులను ఏర్పరచుకుంటాడు. తల్లితండ్రులు, ఉపాధ్యాయుడు ఎలాఉంటారో, అలాగే ఉంటాడు పిల్లవాడు చాలవరకు. నిజమైన విద్య ఇంట్లోనే అరంభంకావాలి.మనలాగా మనపిల్లలు దారిద్ర్యానికి, అజ్ఞానానికి, అసూయలకు, ఘర్షణలకు దైన్యానికి, దుఃఖానికి చితికి చివికిపోకుండా ఉండాలంటే, మనను ఇంత సంక్షోభకు గురిచేస్తున్న విద్యావిధానాలను, జీవనరీతులను మనపిల్లలపై రుద్దకూడదు. ఇలారుద్ది, తర్వాత మనపిల్లలు ఆకలిజ్వాలల్లో, తిరుగుబాటుల్లో, యుద్ధరంగాల్లో,ఆత్మహత్యల్లోచిక్కుకుపోయారని విలపించి ప్రయోజనం ఏమిటి?

సత్యానికి ద్వారం విద్య. విద్యఅనే ఉద్యమంలో తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వాములు. ప్రభుత్వం చేయాత. మనపిల్లలు కేవలం పెద్దపెద్ద డిగ్రీలు సంపాదించాలదో, మనకు పేరు తెచ్చిపెట్టాలనో గాక, జీవితంలో నిజమైన సుఖశాంతులను సిద్ధింపజేసుకొనేట్టుగా మనమంతా వారికి నరైనవిద్యను సమకూర్చడానికి పాటుపడుదాం''

ఇండియా పట్ల అమెరికా ఆసక్తి:

పంచవర్ష ప్రణాళిక

(4)

ప్రజలను పట్టి పీడిస్తున్న ఆర్థిక, సాంఘిక సమస్యలనుంచి విముక్తి పొందడానికిగాను ఇండియా పంచవర్ష ప్రణాళిక నొకదానిని ప్రారంభించింది. అయితే, ఇది సకల బాధానివారిణి ఏ విధంగానూ కాదు. కొంత బయటివారి సహాయంతో తగుమాత్రపు లక్ష్యాలను సాధించడానికి గాను ఈ ప్రణాళిక ఉద్దేశించబడింది.

ఇండియాలో ఐదింట నాలుగువంతులమంది గ్రామాలలో నివసిస్తున్నారు. నాలుగింట మూడువంతుల మంది వ్యవసాయపు పనులు చేసుకుంటున్నారు. అందువల్ల పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయానికి ప్రాధాన్యమిచ్చియుండడం సమంజసమైన విషయమే. ప్రస్తుతం సాగులోనున్న భూములలో ఆహార పదార్థాల ఉత్పత్తిని ఇంకా ఎక్కువ చేయడం, సాగులోలేని భూములను కొత్తగా సాగులోనికి తీసుకురావడం ఈ ప్రణాళిక లక్ష్యం. అందువల్ల భూసార రక్షణకుగాను కొత్తగా కృషిజరుగుతున్నది. వ్యవసాయం ఇంకా చురుకుగా జరుగుతున్నది. నూతులు, కాలువలు కొత్తగా తవ్వబడుతున్నాయి. పెద్దపెద్ద నదులవల్ల వరదలురాకుండా కాపాడి, జలవిద్యుచ్ఛక్తి సమృద్ధిగా లభించేటట్లు చేయడానికిగాను ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నది.

భారతీయ జీవనానికి సంబంధించిన ఇంకా అనేక విషయాలలో కూడా పురోభివృద్ధి సాధించడం కూడా ఈ ప్రణాళిక ఆశయం. పారిశ్రామికాభివృద్ధి ఇంకా ఎక్కువ జరిగేటందుకు, ప్రయాణ సౌకర్యాలు, రహదారులు ఇంకా ఎక్కువయేటందుకు ఈప్రణాళికద్వారా కృషి జరుగుతున్నది.ఇంతేగాక, ప్రజారోగ్యం విషయంలోను, గృహనిర్మాణం విషయంలోను, విద్యా విషయంలోను, సాంఘిక సంక్షేమం విషయంలోను, నిర్వాసులపునరావాసం విషయంలోను, కార్మిక యజమాని సంబంధాల విషయంలోను కూడా అభివృద్ధిని సాధించడం ఈ ప్రణాళిక యొక్క తదితర లక్ష్యాలు.

ఆసియాలోకల్లా జపాను తరువాత పారిశ్రామికంగా ఎక్కువ అభివృద్ధి పొందిన దేశంఇండియా, ప్రపంచంలో కల్లా పారిశ్రామికంగా అభివృద్ధి పొందిన దేశాలలో ఇది ఎనిమిదవ స్థానం ఆక్రమిస్తున్నది. ఇండియాలోని తాతాఇనుము ఉక్కు కర్మాగారాలు ఆసియాలోకల్లా పెద్దవి. అయినప్పటికీ, ఆర్థిక సౌష్ఠవానికి కావలసినదానికంటె ఇండియా పారిశ్రామికంగా చాలా వెనుకపడి వుంది. ఉదాహరణకు: ఇండియా సాలీనా 15లక్షల టన్నుల ఉక్కును, అనగా అమెరికా ఉత్పత్తి చేసేదానిలో నూటికి 1.5 వ వంతును మాత్రమే ఉత్పత్తి చేస్తున్నది.

ఇండియాలోని పారిశ్రామిక శక్తి ప్రజావసర వస్తువులు- సూలువస్త్రాలు. అగ్గిపెట్టెలు, పంచదార, ఉప్పు, కాగితం మొదలైననాటిని తయారు చేయడానికే ప్రస్తుతం వినియోగించబడుతున్నది. ఇండియాలోని పరిశ్రమలలోకల్లా టెక్‌స్టయిల్ పరిశ్రమ పెద్దది. దేశంలోని ముఖ్యమైన భారీపరిశ్రమలు ఇనుము-ఉక్కు, సిమెంటు, రసాయన పరిశ్రమలు. దేశంనుంచి జరుగుతున్న ఎగుమతులలోకల్లా జనపనారతో తయారుచేయబడిన వస్తువులు ప్రధానమైనవి.

ఈ జనపనారతో తయారు చేయబడిన వస్తువుల ఎగుమతివల్ల లభిస్తున్నంత విదేశీ కరెన్సీ మరేవస్తువు వల్లనూ లభించడంలేదు. ఈ కరెన్సీ ఇతర దేశాలనుంచి ఇండియా దిగుమతి చేసుకొనవలసిన వస్తువులను కొనడానికి ఉపయోగపడుతున్నది.

ఇండియా తన ఆర్థికాభివృద్ధికి అవసరమైన పరిశ్రమలను పెంపొందించుకొనడానికి విదేశీపెట్టుబడులను ఆకర్షించాలనుకుంటున్నది. ఈ విషయమై శ్రద్ధ వహిస్తున్నట్లు అనేక చర్యల ద్వారా ఇండియా నిరూపిస్తున్నది. పెట్రోలు శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేయడానికిగాను బ్రిటిషు, అమెరికన్ సంస్థలతో ఇటీవల జరుపుకున్న ఒడంబడికలు ఇందుకు ఒక ఉదాహరణ.

ప్రస్తుతం వున్న పరిశ్రమలు యావచ్ఛక్తిని వినియోగించి పనిచేయాలనీ, వీటితోపాటు మరికొన్ని కర్మాగారాలు అదనంగా నిర్మించబడాలనీ, ఇండియా ప్రభుత్వం నిశ్చయించుకున్నది. కొన్ని ప్రధానమైనపరిశ్రమలకు తోడ్పడడానికి, కొన్ని ముఖ్యమైన పరిశ్రమల స్థాపనకు ప్రయివేటు పెట్టుబడిదారులు పూనుకొనకపోతేవాటిని తనే స్థాపించడానికి ప్రభుత్వం పూనుకుంటుంది. అయినప్పటికీ, మామూలుగా పారిశ్రామికాభివృద్ధి జరుపకలసిన బాధ్యత ప్రయివేటు పెట్టుబడిదారులదేనని భావించబడుతున్నది. ఫ్యాక్టరీలలో అరిగిపోయిన యంత్ర సామగ్రికి బదులుగా కొత్త సామగ్రిని ఏర్పాటు చేయడం ఒకటి చాలాకష్టంగా వుంది. ఇందుకు కావలసిన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు.

ఉక్కు, సిమెంటు, రసాయనపదార్థాలు మొదలైన ప్రధానమైన వస్తువుల ఉత్పత్తిని, రవాణా సౌకర్యాలను ఇంకా ఎక్కువ చేయాలనీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. 1955-56 నాటికి ఈ కార్యక్రమంవల్ల పారిశ్రామికాభివృద్ధి ఇంకా బహుముఖాల జరగడానికి వీలు కలుగవలసి వుంది.

యుద్ధకాలంలో ప్రయాణాలు చాలా ఎక్కువకావడంవల్ల ఇండియాలోని రైలుమార్గాల పటుత్వం తగ్గిపోయివుంది. కొత్తగా రైలుమార్గాలను నిర్మించడంవల్ల కంటె, ప్రస్తుతంవున్న రైలుమార్గాలను బాగుచేయడం వల్లనే శ్రద్ధ వహించాలని పంచవర్ష ప్రణాళికలో సూచించబడింది. అందువల్ల కొత్తగా రైలుమార్గాల నిర్మాణం వల్ల కంటె వాతవాటిని బాగుచేయడం వల్లను, వాటిని సక్రమంగా నిర్వహించడం వల్లనే ప్రభావంగా శ్రద్ధ వహించడం జరుగుతున్నది.

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలోనున్న కుటీర పరిశ్రమలనే ఇంకా